



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 252 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 03 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### తెలంగాణా ఏమైనా

# మీ అయ్య జాగీరా?



- తెలంగాణలో ఇకపై జనసేన పోటీ చేస్తుందని పవన్ ప్రకటన
- బెదిరింపులకు, హెచ్చరికలకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- చెరువు కబ్జా ఆరోపణలపై సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్
- తాను తెలంగాణకు వ్యతిరేకం కాదని, విభజన తీరునే తప్పుపట్టానని వెల్లడి
- అధికారంపై ఆశ లేదు, సమాజంలో మార్పు మాత్రమే లక్ష్యమని ఉద్ఘాటన

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ గడ్డతో తనకు రాజకీయాలకు అతీతమైన అనుబంధం ఉందని, ఈ ప్రాంతంపై ఎనలేని ప్రేమ ఉందని జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. తనపై కొందరు చేస్తున్న విమర్శలు, బెదిరింపుల నేపథ్యంలో ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఘాటుగా స్పందించారు. ఇకపై తెలంగాణలో జరిగే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని సంచలన ప్రకటన చేశారు. ఈ నిర్ణయంతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి తెరలేపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడతావని, ఇక్కడ నీకేం పని అని కొందరు నన్ను ప్రశ్నిస్తున్నారు. దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. తెలంగాణ ఏమైనా వాళ్ల అయ్య జాగీరా? ఇలాంటి బెదిరింపులకు భయపడే వ్యక్తిని నేను కాదు," అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తనను తిరగనివ్వబోమని బెదిరించినప్పుడు, తన 'వారాహి' వాహనానికి అనుమతులు ఇచ్చి అండగా నిలబడింది తెలంగాణ సమాజమేనని ఆయన గుర్తుచేశారు. జనసేన పార్టీ పుట్టిందే తెలంగాణ నడిబొడ్డున అని, ఈ గడ్డ రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత తనకు ఉందని స్పష్టం చేశారు.

**విభజన తీరునే వ్యతిరేకించాను**

తాను ఎన్నడూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కాదని పవన్ కల్యాణ్ మరోసారి స్పష్టం చేశారు. "రాష్ట్రాన్ని విభజించిన తీరును మాత్రమే నేను వ్యతిరేకించాను. పార్లమెంట్ తలుపులు మూసి, ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుపట్టాను. అంతేగానీ, తెలంగాణ ప్రజల ఆకాంక్షను నేను ఎప్పుడూ గౌరవించాను. సామాజిక తెలంగాణ రావాలన్నదే నా ఆకాంక్ష" అని వివరించారు. ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలతో మొదలైన వివాదాన్ని పట్టుకుని, ప్రెస్ క్లబ్‌లో సమావేశాలు పెట్టి మరీ తనను తిట్టే స్థాయికి కొందరు దిగజారారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.


**సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ సవాల్**

తనపై వస్తున్న భూకబ్జా ఆరోపణలపైనా పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. "హైదరాబాద్‌లో నేను ఒక చెరువును కబ్జా చేశానని మిగతా .. 2లో..

### 2027 గోదావరి పుష్కరాలు

# చరిత్రలో నిలిచిపోవాలి

- 2027 గోదావరి పుష్కరాలను అట్టహాసంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశం
- పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి
- ధవళేశ్వరం నుంచి పోలవరం వరకు అఖండ గోదావరి కారిడార్ అభివృద్ధికి సూచన
- ఆరు జిల్లాల్లో 525 ఘాట్లు, 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- జూన్ 24 కల్లా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవాన్ని చాటేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రుల కమిటీ, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తామని, ఇది యాత్రికులకు అదనపు ఆకర్షణగా నిలుస్తుందని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ధవళేశ్వరం నుంచి పోలవరం ప్రాజెక్టు వరకు ఉన్న ప్రాంతాన్ని 'అఖండ గోదావరి కారిడార్'గా అభివృద్ధి చేయాలని సూచించారు. పుష్కరాల కోసం అభివృద్ధి చేసే అన్ని మౌలిక సదుపాయాలు గోదావరి బేసిన్ ప్రాంతానికి శాశ్వత ఆస్తులుగా మారాలని ఆకాంక్షించారు. ఈ పుష్కరాలతో రాజమహేంద్రవరం ఒక ప్రధాన మహానగరంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పోలవరం, ఏలూరు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, మిగతా .. 2లో..

### బెంగళూరు-విజయవాడ మధ్య

# ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం

- ప్రయాణ దూరం 110 కి.మీ, సమయం 4 గంటల వరకు ఆదా
- కడప జిల్లా మీదుగా 123 కి.మీ.. పారిశ్రామికంగా కీలక ప్రయోజనం
- కొప్పర్తి, హిందూపురం పారిశ్రామిక ప్రాంతాలకు మెరుగవనున్న కనెక్టివిటీ
- అత్యాధునిక టెక్నాలజీతో ట్రాఫిక్, టోల్ వ్యవస్థల ఏర్పాటు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** బెంగళూరు, విజయవాడ నగరాలను కలిపే ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ యాక్సెస్ కంట్రోల్డ్ హైవే నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ రహదారి అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కడప జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి భారీ ఊతం లభించనుంది. ఆంగ్ల మీడియా కథనం ప్రకారం, జాతీయ రహదారి-544+లో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడ ఆర్థిక కారిడార్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ కొత్త రహదారి నిర్మాణంతో బెంగళూరు-విజయవాడ మధ్య దూరం సుమారు 110 కిలోమీటర్లు తగ్గనుంది. దీంతో ప్రయాణ సమయం 3 నుంచి 4 గంటలు ఆదా మిగతా .. 2లో..

# రష్యా చేరుకున్న మంత్రి లోకేష్

### మాస్కోలో ఘనస్వాగతం పలికిన ఎన్నారైలు, ఎంబసీ అధికారులు



**రష్యా, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ రష్యా పర్యటనకు వెళ్లారు. ఆరు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం రష్యా రాజధాని మాస్కో చేరుకున్నారు. మాస్కో విమానాశ్రయంలో లోకేష్‌కు భారత రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ నిఖిలేశ్ గిరి, స్థానిక ఆంధ్ర ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) ఘన స్వాగతం పలికారు. ఆయన జూన్ 7 వరకు రష్యాలోనే పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా ఆయన సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగే అంతర్జాతీయ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొననున్నారు. ఇది రష్యాలో జరిగే కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య, పెట్టుబడుల సదస్సు. ఈ వేదికపై లోకేష్ ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించనున్నారు. ప్రస్తుత ప్రభుత్వం మిగతా .. 2లో..

### పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగొద్దని

# మేం చెప్పడం లేదు

### తెలంగాన ప్రజలకు క్షమాపణ చెప్పాలి : మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే ఇక్కడ సభలు నిర్వహించుకోవాలని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగడాన్ని మేం ఆపడం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే హైదరాబాద్‌లో సభ పెట్టాలనుకోవడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 'నవ నిర్మాణ సంకల్ప సభ' నిర్వహించాలని పవన్ కల్యాణ్ మొదట భావించారు. అయితే, శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీ సభకు అనుమతి నిరాకరించారు. దీంతో జనసేనాని జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మిగతా .. 2లో..

### నేను లేకపోతే

# జైల్లో ఉండేవాడివి

### నెతన్యాహుపై ట్రంప్ ఫైర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫైర్ అయినట్లు తెలుస్తోంది. తాను లేకపోతే ఇప్పటికే జైల్లో ఉండేవాడివంటూ నెతన్యాహుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసినట్లు సమాచారం. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంపై నెతన్యాహును ట్రంప్ మందలించినట్లు అమెరికా అధికారిక వర్గాలను ఉటంకిస్తూ అక్కడి మీడియాలో కథనాలు వస్తున్నాయి. బీరుట్ దక్షిణ శివారు ప్రాంతాలను ఖాళీ చేయాలని అక్కడి ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. అయితే, లెబనాన్‌పై దాడులు చేస్తే అమెరికాతో చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ బెదిరించింది. ఈ క్రమంలో నెతన్యాహుతో ట్రంప్ ఫోన్‌లో మిగతా .. 2లో..

# అమరావతిపై జగన్ వైఖరి బాధ్యతారాహిత్యం

### వైసీపీ ప్రభుత్వం అమరావతిని అల్లకల్లోలం చేసిందన్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత జగన్ అనుసరిస్తున్న వైఖరిపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో పర్యటించిన ఆయన.. అమరావతి గురించి జగన్ చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా బాధ్యతారాహిత్యమైనవని మండిపడ్డారు. ప్రపంచ స్థాయి రాజధానిని ఐదేళ్ల పాలనలో అల్లకల్లోలం మిగతా .. 2లో..

# తుంగభద్ర గేట్లు ప్రమాదకరంగా ఉన్నా.. జగన్ పట్టించుకోలేదు

### మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తుంగభద్ర గేట్లు ప్రమాదకరంగా ఉన్నా.. నాటి సీఎంగా ఉన్న జగన్ పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. ఆరు నెలల్లో తుంగభద్ర డ్యామ్‌కు తాము కొత్త గేట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ డ్యామ్‌కు రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లు ఏర్పాటుచేశామన్నారు. తుంగభద్ర గేట్లను ఈ నెలాఖరున ఏపీ, కర్ణాటక ముఖ్యమంత్రులు ప్రారంభిస్తారని తెలిపారు. మంత్రి నిమ్మలను మిగతా .. 2లో..

# చీలిక దిశగా మమత పార్టీ

### బెంగాల్ మంత్రి వ్యాఖ్యలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** తృణమూల్ కాంగ్రెస్ రెండుగా చీలడానికి సిద్ధంగా ఉందని పశ్చిమ బెంగాల్ మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కనిపించిన పరిస్థితులే ఇక్కడా రానున్నాయన్నారు. ఆ రాష్ట్రంలో శివసేన పార్టీ రెండు ముక్కలైన సంగతి తెలిసిందే. పార్టీ గుర్తు విషయంలోనూ వివాదం నడిచింది. దానిని ఉద్దేశించే మంత్రి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యం లేనివారికి టీఎంసీ చోటు కల్పించిందని.. అందుకే ఇప్పుడు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి బయటపడుతోందన్నారు. టీఎంసీ విచ్ఛిన్నదిశగా ఉందని, చివరకు రాజకీయరంగం నుంచి కనుమరుగవుతుందన్నారు. ఈ నేత 2024లో తృణమూల్ కాంగ్రెస్ నుంచి భాజపాలో చేరారు. తిరుగుబాటు వర్గానికి టీఎంసీ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నాయకత్వం వహిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తమ పార్టీని మిగతా .. 2లో..

### సీడబ్ల్యూసీ సభ్యుడిగా

# సిద్ధరామయ్య నియామకం



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల కర్ణాటక సీఎంగా రాజీనామా చేసిన సిద్ధరామయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం కీలక పదవికి ఎంపిక చేసింది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా నియమిస్తున్నట్లు

# నీట్ పేపర్ లీక్.. నిందితుడి నివాసంపై బుల్డోజర్ చర్య



**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్-యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పీవీ కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బీడ్ జిల్లాలోని ఆయన ఇంటిని నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తున్నట్లు గుర్తించిన అధికారులు.. దాని తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో ఆక్రమణలను తొలగించారు. పీవీ కులకర్ణి.. బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు మిగతా .. 2లో..

# సరిహద్దులో 98 శాతం క్లియర్‌గానే

### నేపాల్ ప్రధాని వ్యాఖ్యలపై భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్- నేపాల్ సరిహద్దు అంశం తాజాగా చర్చనీయాంశం అవుతోంది. సరిహద్దులపై నేపాల్ ప్రధాని బాలేంద్ర షా వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ సమస్యను పరిష్కరించేందుకు తమ రెండు దేశాలు అంగీకారానికి వచ్చాయని, ఈ సరిహద్దు అంశాన్ని చైనా, బ్రిటన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. "భారత్-నేపాల్ సరిహద్దుకు సంబంధించి నేపాల్ ప్రధాని చేసిన వ్యాఖ్యలు, తర్వాత ఆ దేశ విదేశాంగశాఖ చేసిన ప్రకటనను గమనించాం. రెండు దేశాల సరిహద్దులో 98 శాతం గుర్తించినదే. పరిష్కారం కాని కొన్ని అంశాలు ఉన్నాయి. కాలక్రమంలో గండక్ నది ప్రవాహం మారడమూ ఈ అపరిష్కృత అంశాలకు ఓ కారణం. సరిహద్దు ఆక్రమణలు, ఎవరికీ చెందని భూభాగంలో చొరబాట్లు వంటి సమస్యలు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### తెలంగాణా ఏమైనా

# మీ అయ్య జాగీరా?

ఆరోపిస్తున్నారు. నేను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నా. ఆ భూమిని పరిశీలించండి. నేను కబ్జా చేశానని నిరూపణ అయితే, ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఆ భూమిని స్వాధీనం చేసుకోవచ్చు. నాపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవచ్చు" అని బహిరంగ సవాల్ విసిరారు. తనకు అధికారం మీద ఆశ లేదని, ఏపీలోనే తాను అధికారాన్ని ఆశించలేదని, అలాంటిది తెలంగాణలో ఎందుకు ఆశిస్తానని ప్రశ్నించారు. వ్యవస్థలో మార్పు తీసుకురావడమే తన ఏకైక లక్ష్యమని పునరుద్ఘాటించారు.

**క్షేత్రస్థాయిలోకి జనసేన.. ఇక పోటీయే**

తెలంగాణలో పార్టీని బలోపేతం చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయాలని క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు ఎప్పటినుంచో కోరుతున్నారని పవన్ తెలిపారు. "ఇన్నాళ్లూ ఓపిక పట్టాం. ఇకపై ఊరుకునేది లేదు. నేనే స్వయంగా తెలంగాణ అంతటా పర్యటిస్తాను. రాబోయే ఎన్నికల్లో జనసేన పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుంది. ఎవరు ఏం చేసుకుంటారో చూసుకోండి" అంటూ తన రాజకీయ ప్రత్యర్థులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. తనను విమర్శిస్తున్న నాయకులు కనీసం ఆదిలాబాద్ అడవుల్లో కూడా పర్యటించి ఉండరని, తనకు తెలంగాణలోని ప్రతి మూల తెలుసని ఆయన అన్నారు. ఈ ప్రకటనతో తెలంగాణ రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**చెరువు కబ్జా ఆరోపణలపై తీవ్రంగా స్పందించిన పవన్ కళ్యాణ్**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తనపై వస్తున్న చెరువు కబ్జా ఆరోపణలపై తీవ్రస్థాయిలో స్పందించారు. ఆ ఆరోపణలు నిరూపిస్తే సదరు ఆస్తిని తెలంగాణ ప్రభుత్వానికే రాసిస్తానని సవాల్ విసిరారు. మంగళవారం హైదరాబాదులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "మేము ఒక చెరువుని కబ్జా చేశామంట, నాకేం పనిలేదా? నిజంగా మీరు అన్నట్టుగా కబ్జా చేస్తే నా ఇల్లు తగలబెట్టేసేవారు" అంటూ పవన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని తాను నేరుగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే చెబుతున్నానని పేర్కొన్నారు. ఆయనంటే తనకు ఇష్టం, గౌరవం ఉన్నాయని అన్నారు. "పవన్ కల్యాణ్ ఒక చెరువును ఆక్రమించుకున్నాడని మీరు నిరూపిస్తే, ఈరోజు నేను సంతోషంగా తెలంగాణ ప్రభుత్వానికి ఆ చెరువును రాసి ఇచ్చేస్తున్నాను" అని ఆయన అన్నారు. గతంలో కూడా తనను ఇబ్బంది పెట్టేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని పవన్ అన్నారు.

**గద్దర్ గురించి భావోద్వేగంగా మాట్లాడిన పవన్ కళ్యాణ్**

ప్రజా గాయకుడు, దివంగత గద్దర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ భావోద్వేగంగా గుర్తుచేసుకున్నారు. ఇవాళ హైదరాబాద్ లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గద్దర్ బతికున్నప్పుడు ఆయన్ను పట్టించుకోని వారే ఇప్పుడు ఆయన గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. తనను విమర్శించే వారు గద్దర్ గురించి మాట్లాడటంపై ఆయన తీవ్రంగా స్పందించారు. "వామపక్షవాదులం అని చెప్పుకొనే కొందరు విశ్లేషకులు మాట్లాడే తీరు ఆశ్చర్యంగా ఉంటుంది. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అని నినదించిన వామపక్ష భావజాలం, ఈరోజు ప్రాంతీయతకు పరిమితమైపోయింది. కమ్యూనిజం ఇలాంటి వాటి వల్లే చచ్చిపోతుంది. ఇప్పుడు గద్దర్ గురించి మాట్లాడుతున్నారు. కానీ నా సూటి ప్రశ్న ఒక్కటే. "గద్దరన్న బతికి ఉన్నప్పుడు మీరందరూ ఎక్కడ ఉన్నారు? ఆయనకు మీరేం చేశారు?" గద్దరన్న వెన్నులో బుల్లెట్లు దిగినప్పుడు, నడవడానికి ఇబ్బంది పడుతూ నా దగ్గరికి వచ్చారు. మా జర్నలిస్ట్ కాలనీలోని జనసేన ఆఫీస్‌కు వచ్చి నన్ను కలిశారు. నన్ను స్వేచ్ఛగా "ఒరేయ్ తమ్మీ" అని పిలిచేంత చనువు మా మధ్య ఉంది. "ఒరేయ్ తమ్మీ, వెన్నులో బుల్లెట్ల వల్ల నడవలేకపోతున్నా. ఆటోలో తిరగలేకపోతున్నా. ఒక బండి కొనివ్వరా" అని హక్కుగా అడిగారు. నేను 24 గంటల్లోనే ఆయనకు కారు కొనిచ్చాను. ఈ విషయం నేను ఎప్పుడూ చెప్పలేదు. బతికున్నప్పుడు ఆయనకు ఏం చేశారని నేను మిమ్మల్ని అడుగుతున్నా. ఆయనకు కనీసం పర్మిషన్లు కూడా ఇవ్వని మీరు ఇప్పుడు ఆయన గురించి మాట్లాడుతున్నారు. నేను రాజకీయాల్లోకి వచ్చాకే గద్దరన్న పరిచయం అనుకుంటున్నారు. అది నిజం కాదు. నేను 'ఖుషి' సినిమా చేశాక, అన్నయ్య చిరంజీవి గారు నాకు ఫోన్ చేసి, "ఒరేయ్, గద్దర్ గారు నీతో మాట్లాడాలంటున్నారు" అని చెప్పారు. గద్దరన్న నాతో, "ఒరేయ్, నువ్వు సినిమాలో మా పోరాటాలు చూపించావు. తరిమెల నాగిరెడ్డి గారి 'తాకట్లో భారతదేశం' భావాన్ని విజువల్స్‌లో పెట్టావంట. మా భావాలు అర్థం చేసుకున్నవాడివి" అన్నారు. దానికి నేను, "అన్నా, నాకు లెఫ్ట్ వింగో, రైట్ వింగో తెలియదు. నాది హ్యూమనిజం" అని చెప్పాను. ఆ రోజు నుంచి ఆయన చనిపోయేదాకా మా బంధం కొనసాగింది. ఆయన ఆసుపత్రిలో చివరి గడియల్లో ఉన్నప్పుడు కూడా వెళ్లి కలిశాను. "అన్నా మీకు ఏం కావాలి?" అని అడిగితే, "ఏం వద్దురా తమ్మీ, తెలంగాణ, ఆంధ్ర యువతకు, దేశ యువతకు భవిష్యత్తు వాళ్లదే అని చెప్పు" అన్నారు. ఆయన నాకు ఓ లెటర్ కూడా రాసిచ్చారు. కానీ దాన్ని నేను ఇప్పటికీ బయటపెట్టలేదు. అంతటి ఆత్మీయ బంధం మాది" అని పవన్ వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణపై తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. కానీ తెలంగాణ ఏర్పాటు చేస్తే తాను 11 రోజులు అన్నం తినలేదని అన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఎన్నడూ వ్యతిరేకం కాదని, పార్లమెంట్ తలుపులు మూసి అప్రజాస్వామికంగా రాష్ట్రాలను విభజించిన తీరును మాత్రమే వ్యతిరేకించానని తెలిపారు. కొందరు నాయకులు కావాలనే తనపై ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. తన గుండెల్లో తెలంగాణ ఉందని, ఇక్కడి ప్రజలంటే తనకు ఎంతో ప్రేమ అని అన్నారు.

### 2027 గోదావరి పుష్కరాలు

# చరిత్రలో నిలిచిపోవాలి

కోనసీమ, కాకినాడ జిల్లాల్లో మొత్తం 525 ఘాట్లను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పుష్కరాలకు దాదాపు 9.95 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. యాత్రికుల సౌకర్యార్థం రహదారి, రైల్వే ట్రాఫిక్ నిర్వహణపై దృష్టి పెట్టాలని, పుష్కర ఘాట్లకు క్రమపద్ధతిలో నంబర్లు కేటాయించాలని ఆదేశించారు. ప్రత్యేక రైళ్లు, కేంద్రం నుంచి ఆర్థిక సహాయం కోరుతూ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాయాలని అధికారులకు సూచించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన క్షేత్రస్థాయి పర్యటన సిఫార్సులను కూడా ప్రణాళికలో చేర్చాలని తెలిపారు. జూన్ 24 నాటికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని, ఆ తర్వాత పుష్కరాలకు అధికారికంగా కౌంట్‌డౌన్ ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు.

### బెంగళూరు-విజయవాడ మధ్య

# ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం

అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్గం బెంగళూరు-హైదరాబాద్, చెన్నై-విజయవాడ మార్గాలను అనుసంధానం చేస్తుంది. శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ కడప, నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల మీదుగా ఈ హైవే వెళ్లనుంది. ఈ ప్రాజెక్టు వల్ల అత్యధికంగా లబ్ధి పొందనున్నది కడప జిల్లానే. జిల్లాలోని 12 మండలాల మీదుగా సుమారు 123.5 కిలోమీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం జరుగుతోంది. జిల్లాలో ఆరు ప్యాకేజీల కింద రూ.5,377.72 కోట్లతో పనులు చేపడుతున్నట్లు కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 2025 మార్చి నాటికే అటవీ, వన్యప్రాణుల అనుమతులు లభించడంతో పనులకు అడ్డంకులు తొలగిపోయాయి. భూసేకరణ ప్రక్రియ కూడా చివరి దశలో ఉంది. ఈ హైవేతో బెంగళూరు నుంచి హిందూపురం, కొప్పర్తి పారిశ్రామిక కేంద్రాలకు ప్రత్యక్ష కనెక్టివిటీ మెరుగుపడుతుందని మాజీ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మార్గంలో అత్యాధునిక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఉపయోగించుకున్న దూరానికే టోల్ చెల్లించే విధానం అమలు చేయనున్నారు. కడప జిల్లా పరిధిలో 7 ఇంటర్‌ఛేంజ్‌లు, 4 వే-సైడ్ అమెనిటీస్ (ప్రయాణికుల సౌకర్య కేంద్రాలు) ఏర్పాటు చేయనుండటం విశేషం.

# రష్యా చేరుకున్న మంత్రి లోకేష్

ఏర్పడిన తర్వాత విదేశీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా చేపడుతున్న చర్యల్లో ఈ పర్యటన ఒక భాగమని తెలుస్తోంది. పర్యటనకు సంబంధించిన మరిన్ని వివరాలు సదస్సు జరుగుతున్న కొద్దీ వెల్లడయ్యే అవకాశం ఉంది.

### పవన్ కల్యాణ్ తెలంగాణలో తిరగొద్దని

# మేం చెప్పడం లేదు

మీడియా సమావేశం నిర్వహించారు. ఈ పరిణామాలపై హుస్నాబాద్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గతంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని పవన్ దెబ్బతీశారు. అలాంటి వ్యక్తి, తెలంగాణకు ఎంతో భావోద్వేగమైన ఆవిర్భావ దినోత్సవాన సభ ఎలా పెడతారు?" అని ప్రశ్నించారు. పవన్‌ను 'పెయిడ్ ఆర్టిస్ట్'గా అభివర్ణించిన పొన్నం, ఆయన పర్యటన వెనుక బీజేపీ వంటి ఇతర పార్టీల అజెండా ఏమైనా ఉందా అని అనుమానం వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం పవన్ తెలంగాణకు వచ్చినప్పుడు ప్రభుత్వం ఆయనకు ప్రోటోకాల్ ఇచ్చి స్వాగతించిందని గుర్తుచేశారు. ఆయన రాష్ట్రానికి రావడాన్ని ఎవరూ అడ్డుకోరని, కానీ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. దివంగత ప్రజా గాయకుడు గద్దర్‌కు సంబంధించిన వ్యాఖ్యలను కూడా ప్రస్తావిస్తూ పవన్ క్షమాపణ చెప్పాలని పొన్నం డిమాండ్ చేశారు. ఏపీ ప్రజలను తెలంగాణ స్వాగతిస్తుందని మంత్రి అన్నారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామని, తెలంగాణలో తిరగవచ్చని స్పష్టం చేశారు. తెలంగాణలో ఏపీ ప్రజలకు ఏం పని అని తాము అనడం లేదని వ్యాఖ్యానించారు. కానీ తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బతినే చర్యలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ లేదా బీఆర్ఎస్ నుంచి చిట్టీలు వస్తున్నాయా అని నిలదీశారు.

# నేను లేకపోతే జైల్లో ఉండేవాడివి

మాట్లాడారు. టెల్అవీవ్ చర్యలు.. ఇరాన్‌తో దౌత్య ప్రయత్నాలను దెబ్బతీస్తున్నాయని, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను పెంచుతున్నాయని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారనేది ఆ మీడియా కథనాల సారాంశం. 'నువ్వు పిచ్చివాడివి. నేను లేకుంటే నువ్వు జైలులో ఉండేవాడివి. నేను నిన్ను కాపాడుతున్నా. ప్రస్తుతం అందరూ నిన్ను ద్వేషిస్తున్నారు. నీ చర్యల వల్ల ఇజ్రాయెల్‌ను కూడా ఇష్టపడటం లేదు' అని నెతన్యాహుపై ట్రంప్ మండిపడినట్లు అవి పేర్కొన్నాయి. అదే సమయంలో 'అసలు నువ్వు ఏం చేస్తున్నావు..?' అంటూ ఇజ్రాయెల్ ప్రధానిపై ట్రంప్ గట్టిగా అరిచినట్లు వెల్లడించాయి. ఈ సందర్భంగా నెతన్యాహు నిర్ణయాలను కూడా ప్రశ్నించారని పేర్కొన్నాయి. ఒక హెజ్‌బొల్లా కమాండర్‌ను హతమార్చేందుకు టెల్అవీవ్ చేస్తున్న సైనిక చర్యల్లో అనేకమంది లెబనీస్ పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై ఆందోళన వ్యక్తంచేసినట్లు కూడా వెల్లడించాయి. ఇక, నెతన్యాహుతో సానుకూలమైన సంభాషణ జరిగిందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో ఓ పోస్టు ద్వారా వెల్లడించారు. బీరుట్ వైపు ఇజ్రాయెల్ దళాలు వెళ్లవని హామీ ఇచ్చారు. ఈమేరకు హెజ్‌బొల్లా నాయకులతోను మాట్లాడినట్లు ట్రంప్ తెలిపారు. ఇజ్రాయెల్‌పై సైనిక కాల్పులను ఆపేందుకు వారు అంగీకరించినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్ కూడా వారిపై కాల్పులకు దూరంగా ఉంటుందని వెల్లడించారు. అయితే, నెతన్యాహు ప్రకటన ఇందుకు భిన్నంగా ఉంది. ఇజ్రాయెల్ నగరాలు, పౌరులపై దాడులు కొనసాగితే హెజ్‌బొల్లాను లక్ష్యంగా చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ట్రంప్‌నకు కూడా తెలియజేసినట్లు పేర్కొన్నారు.

# అమరావతిపై జగన్ వైఖరి బాధ్యతారాహిత్యం

చేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని తెలిపారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టి, రాజధాని నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి.. ఇప్పుడు అభివృద్ధిపై నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందంటూ జగన్ తీరును ఎండగట్టారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసి, వేలాది కుటుంబాలను గత వైసీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా, ఇప్పుడు అసత్యాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. రాజధాని అభివృద్ధిని అడ్డుకున్న వారే అవినీతి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. జగన్ చేసిన విధ్వంసాన్ని సరిదిద్దుతూ, నిలిచిపోయిన పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించిందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా, రాష్ట్ర గౌరవ ప్రతీకగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వేగంగా అడుగులు వేస్తున్నాయని స్పష్టం చేశారు. రైతుల ఆకాంక్షలకు అనుగుణంగా రాజధాని నిర్మాణం కొనసాగుతుందని, దీనిపై జగన్ రాజకీయాలు చేయడం మానుకోవాలని మంత్రి హితవు పలికారు.

## తుంగభద్ర గేట్లు ప్రమాదకరంగా ఉన్నా.. జగన్ పట్టించుకోలేదు

మంగళవారం తుంగభద్ర బోర్డు ఛైర్మన్ ఎస్.ఎన్.పాండే కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారీ వరదలకు తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకుపోయిందని తెలిపారు. భారీ వరదలోనూ స్టాప్ లాగ్ గేట్ ఏర్పాటు చేయడం ద్వారా 80టీఎంసీల నీటి వృథాను అరికట్టామని తెలిపారు.

# చీలిక దిశగా మమత పార్టీ

ఐప్యాక్ హైజాక్ చేసిందని, అది ఇక మమతా బెనర్జీది కాదని ఈ ఎమ్మెల్యే వ్యాఖ్యలు చేశారు. సుమారు 50 మంది ఎమ్మెల్యేలు మమత నాయకత్వం నుంచి బయటకు వచ్చి పార్టీ గుర్తును సొంతం చేసుకోవాలనుకుంటున్నారని పార్టీ జాతీయ ప్రతినిధి రిజుదత్తా అన్నారు. రితబ్రత బెనర్జీ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత కావాలని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు కోరుకుంటున్నారని చెప్పారు. శోభన్‌దేబ్ చటోపాధ్యాయ ఉండాలని మమత భావిస్తున్నారన్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని రితబ్రత, సందీపన్ సాహాను టీఎంసీ బహిష్కరించింది. అలాగే రిజును సస్పెండ్ చేసింది.

**నేను పోరాడుతా లేకపోతే..: మమత**

ఇదిలా ఉంటే.. ఎన్నికల అనంతరం తమ పార్టీ నేతలపై జరుగుతోన్న దాడులకు వ్యతిరేకంగా మమత మంగళవారం కోల్‌కతాలో భారీ ధర్నా చేపట్టారు. "నేను పోరాడుతాను లేకపోతే చనిపోతాను. ఒక వేదిక ఏర్పాటు చేసుకోవడానికి కూడా మాకు అనుమతి ఇవ్వలేదు" అంటూ ఈ సందర్భంగా బెంగాల్‌లోని భాజపా ప్రభుత్వంపై దీదీ విమర్శలు గుప్పించారు. ఇటీవల ఆమె మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై కూడా రాళ్లు, గుడ్లు విసిరి దాడి చేసిన సంగతి తెలిసిందే.

### సీడబ్ల్యూసీ సభ్యుడిగా

# సిద్ధరామయ్య నియామకం

ప్రకటించింది. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటక సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేయగా.. కొత్త సీఎంగా డీకే శివకుమార్‌ను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. నూతన సీఎంగా డీకేఎస్ బుధవారం సాయంత్రం బెంగళూరులో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

## నీట్ పేపర్ లీక్.. నిందితుడి నివాసంపై బుల్డోజర్ చర్య

ఉన్న ఇంటి స్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. సర్వే నిర్వహించగా.. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు ఆరోపణలు రావడంతో.. సమీక్షించిన ఎన్‌టీఏ మే 12న పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు, ఈ వ్యవహారంలో సీబీఐ ఇప్పటివరకు 13 మందిని అరెస్టు చేసింది.

# సరిహద్దులో 98 శాతం క్లియర్‌గానే

ఉన్నాయి. ఈ సరిహద్దు అంశాలను పరిష్కరించుకోవడానికి ద్వైపాక్షిక యంత్రాంగం ఉంది. రెండు దేశాల వ్యవహారంలో మూడో పక్షం జోక్యం లేదని స్పష్టంగా తెలియజేస్తున్నాం" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జయస్వాల్ మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

**అక్రమ వలసలను భారత్ సమర్థించదు : MEA**

అమెరికా తాజాగా 30 మంది భారత ట్రక్కు డ్రైవర్లను భారత్‌కు తిప్పి పంపించిందని రణ్‌ధీర్ జయస్వాల్ తెలిపారు. అక్రమ వలసలను భారత్ సమర్థించదని స్పష్టం చేశారు. డిపోర్టేషన్ ఆపరేషన్ విషయంలో అమెరికా ప్రభుత్వానికి సహకరిస్తామన్నారు. అయితే, వారి పౌరసత్వాన్ని పరిశీలించిన తర్వాతే దేశంలోకి అనుమతిస్తామని చెప్పారు.

# ఆమెను 600 మంది రేప్ చేశారు'

### పాక్ ముఠాల ఆగడాలపై బ్రిటన్ ఎంపీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రిటన్‌లో లైంగిక వేధింపుల ముఠాల అరాచకాలపై అక్కడి చట్టసభ మరోసారి చర్చించింది. అనేక రాష్ట్రాల్లో చిన్నారులు, మహిళల లైంగిక దోపిడీకి సంబంధించి స్వతంత్ర దర్యాప్తు నివేదికలోని సంచలన విషయాలను బాహ్య ప్రపంచం ముందుంచింది. వ్యవస్థీకృత ముఠాల వేధింపులు, అత్యాచారాలు, పోలీసులు వ్యవహరించిన తీరు, తదితర అంశాలపై బాధితులు, పలువురు సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలను కొందరు చట్టసభ సభ్యులు వివరించారు. ఈ దారుణాలకు పాల్పడిన వారిలో ఎక్కువశాతం పాకిస్థాన్ మూలాలున్న ట్యాక్సీ డ్రైవర్లు, వ్యాపారులే ఉన్నట్లు గతంలో తేలిన విషయం తెలిసిందే. బ్రిటన్ పార్లమెంట్ సభ్యుడు రూపెర్ట్ లోవ్ మాట్లాడుతూ.. "లైంగిక దాడులకు గురైన వారిలో ఎంతో మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. మైనర్‌గా ఉన్నప్పుడే తనపై లైంగిక దాడి జరిగిందని ఓ బాధితురాలు చెప్పింది. మూడేళ్లలో ఆమెపై 600-700 మంది అత్యాచారం చేసినట్లు ఆవేదన వ్యక్తం చేసింది. తన ప్రైవేటు భాగాలను తీవ్రంగా గాయపరిచినట్లు మరో మహిళ పేర్కొంది. బాధితులను జంతువుల్లా చూసినట్లు అనేక మంది చెప్పారు. శ్వేతజాతీయులనే లక్ష్యంగా చేసుకొని ఈ ముఠాలు లైంగిక హింసకు పాల్పడ్డాయని మరికొందరు బాధితులు వాంగ్మూలం ఇచ్చారు. కొందరు పోలీసు అధికారులు వ్యవహరించిన తీరుపైనా అనేక ఆరోపణలు ఉన్నాయి" అని వివరించారు. ఇలాంటి దురాగతాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవాలని చట్టసభ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. బ్రిటన్‌లో లైంగిక వేధింపుల ముఠా అరాచకాల విషయం 2002లో తొలిసారి వెలుగులోకి వచ్చింది. పాకిస్థాన్ మూలాలున్న అనేక మంది.. దేశవ్యాప్తంగా కొన్ని వర్గాల అమ్మాయిలను లక్ష్యంగా చేసుకొని లైంగిక దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. సౌత్ యార్క్‌షైర్‌లో 2010లో కొందరు మైనర్ అమ్మాయిలను వేధించిన కేసులో పాక్ మూలాలున్న ఐదుగురు దోషులుగా తేలడం అప్పట్లో సంచలనం రేపింది. అనంతరం రోచ్‌డేల్, రోథర్‌హ్యామ్, ఓల్డ్‌హ్యామ్, టెల్ఫోర్డ్ తదితర ప్రాంతాల్లో జరిపిన దర్యాప్తులో ఈ వ్యవస్థీకృత ముఠాల దుర్మార్గాలు బయటపడ్డాయి. అయితే, చాలా కేసుల్లో పోలీసు అధికారుల పాత్ర కూడా ఉందని, బాధితుల ఫిర్యాదులపై సరైన చర్య తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి.

# ఎడిటర్ వాయిస్

## నై నై అంటున్న నైరుతి.. వానదేవుని షాక్!

పూర్తిగా వ్యవసాయిక దేశం అయిన భారత్ లో వర్షాలే ఆధారం. ఎంతలా అంటే దేశ జీడీపీని ప్రభావితం చేసేటంతలా. గ్రామీణ ప్రాంతాలు దేశంలో నూటికి డెబ్బై శాతం ఉన్నాయి. దాంతో దేశ జాతీయ స్థూల ఆదాయం వృద్ధి చెందాలీ అంటే గ్రామీణ భారతం పచ్చగా ఉండాలి. అది ఎపుడు సాధ్యపడుతుంది అంటే భారీగా సమాయనుకూలంగా వానలు పడి పంటలు పండినపుడు. దేశంలో ఆర్ధిక సంవత్సరం ఏప్రిల్ 1న మొదలవుతుంది. కానీ దేశంలో అగ్రికల్చర్ ఇయర్ మాత్రం జూన్ లో స్టార్ట్ అవుతుంది. దానికి కారణం నైరుతు రుతు పవనాల రాక. ఈ రుతు పవనాలు ఎంత తొందరగా వస్తే అంత సంబరంగా ఏరువాక స్టార్ట్ అవుతుంది. దాంతో రైతాంగం సైతం సంబరాలు చేసుకుంటుంది. కానీ ఈసారి పరిస్థితి చూస్తే నైరుతి నై నై అంటోంది.

**బ్యాడ్ న్యూస్ చెబుతోందా :** సకాలంలో నైరుతి రుతు పవనాలు దేశంలోకి ప్రవేశించడం అంటే మే నెలాఖరు అన్న మాట. ఈ మేరకు భారత వాతావరణ విభాగం ఐఎండీ అయితే మొదట చెప్పింది మే 26న నైరుతి దేశంలో ఎంట్రీ ఇస్తుందని. కానీ ఆ డేట్ తప్పింది. ఆ తరువాత మే 30, 31 తేదీలు అన్నా కూడా అదీ జరగలేదు. జూన్ 1 లేదా 3 అని చెప్పినా ఇపుడు ఆ డేటూ మారింది. లేటెస్ట్ డేట్ ఏంటి అంటే జూన్ 8 తరువాత అని అంటున్నారు. అయితే అది కూడా అంత కన్ ఫర్మ్ అవునా కాదా అన్నది ఒక పెద్ద డౌట్. మరో వైపు చూస్తే ఈసారి నైరుతి ఆగమనం లేట్ అయినా వానలు కూడా చాలా తక్కువ పడతాయని దానికి కారణం నైరుతి బలహీనంగా ఉందని. ఈ వార్తలు అయితే రైతాంగాన్ని కాదు దేశ ఆర్ధిక నిపుణులను కూడా షాక్ కి గురి చేస్తున్నాయి. ఈసారి వానలు తక్కువ పడితే ఆ ప్రతికూల పరిస్థితి ఎలా ఉంటుంది అనే అంతా ఆలోచిస్తున్నారు. ఈసారి తేలిక పాటి వానలే పడతాయంటే వ్యవసాయం సంగతి ఏమిటి అన్నది కూడా మరో చింతగా మారుతోంది.

**కేరళం వైపు చూపు :** భారత్ లో నైరుతి ఎంట్రీకి గేట్ వే కేరళం రాష్ట్రం. అక్కడ నుంచే మెల్లగా దేశంలోకి ప్రవేశించి మొత్తం దేశమంతా కొద్ది కాలంలోనే సర్దుకుని భారీ వానలు కురుస్తాయి. అలా వర్షాకాలం సీజన్ స్టార్ట్ అయి సెప్టెంబర్ నెలాఖరు వరకూ కొనసాగుతుంది. అయితే ప్రస్తుతం కేరళంలో కొన్ని ప్రంతాలలో వర్షాలు పడుతున్నాయి కానీ నైరుతి ఆరంభ సూచిన అది కాదని ఐఎండీ చెబుతోంది. నైరుతి రాకను గుర్తించాలంటే కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. కేరళంలోని ఈ సీజన్ లో ఏకంగా అరవై శాతం పైగా వానలు పడితే నైరుతి ఎంటర్ అయినట్లుగా భావిస్తారు. అలాగే అరేబియా సముద్రం నుంచి పశ్చిమ దిశగా వీచే గాలులు ఆ నిర్దిష్ట వేగాన్ని అందుకోవాల్సి ఉంటుంది. ఆ మీదట ఆయా ప్రాంతమంతా తగినన్ని మేఘాలు విస్తరించి ఉండాలి. ఇవన్నీ నైరుతి రుతు పవనాల ఆగమాన్ని సూచిస్తాయి. ప్రస్తుతం అయితే కేరళం రాష్ట్రంలో కొన్ని చోట్ల వానలు పడుతున్నాయి. మేఘాలు విస్తరించి కూడా ఉన్నాయి. కానీ అసలైన ప్రమాణం అయిన అరేబియా సముద్రం నుంచి గాలులు వీయడం లేదని ఐఎండీ సైంటిస్టూ చెబుతున్నారు . ఈ మూడు ఒకేసారి కలసి ఉంటేనే నైరుతి పవనాల సీజన్ స్టార్ట్ అయినట్లు. అపుడు వర్షాకాలం వచ్చినట్లుగా చెబుతారు.

**ఎల్ నినో ప్రభావంతో :** ఇక ఈసారి పూర్తి స్థాయి వానలు కురిసే అవకాశాలు కూడా తక్కువ అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. దానికి ఎల్ నినో ప్రభావం కారణం అని స్పష్టం చేస్తున్నారు. దాని వల్ల గత ఏడాది కంటే ఈసారి తక్కువ వానలు పడతాయని వాటితోనే సర్దుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.



నైరుతి రుతు పవనాలు ఆలస్యమైనా లేదా ఎంట్రీ ఇచ్చినా బలహీనం కావడం వెనక ఎల్ నినో ప్రభావం గట్టిగా ఉంటుందని అంటున్నారు. ఈ విధంగా వర్షాభావ పరిస్థితులు కనుక ఉంటే ఇది దేశ ఆర్ధిక వ్యవస్థ మీద కూడా పెను ప్రభావం చూపిస్తుందని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## ఏలూరులో అగ్ని ప్రమాదం..

### ఇద్దరు మహిళలు సజీవదహనం



**వేలేరుపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలూరు జిల్లా వేలేరుపాడులో అగ్ని ప్రమాదం జరిగింది. నిద్రిస్తున్న సమయంలో ఇంటికి మంటలు అంటుకోవడంతో ఇద్దరు మహిళలు సజీవదహనమయ్యారు. వలగాని సావిత్రి (60), పూలమ్మ (65) నిద్రలోనే ప్రాణాలు విడిచారు. తెలంగాణలోని సూర్యాపేట నుంచి పూలమ్మ తన చెల్లిని చూసేందుకు ఏలూరు వచ్చినట్లు తెలుస్తోంది. మంటల ధాటికి ఇల్లూ పూర్తిగా దగ్ధమైంది. ఆ మంటలు వ్యాపించి పొరుగున ఉన్న మరో ఇల్లు కూడా కాలిబూడిదైంది.

## ప్రైవేటు వసతి గృహంలో విద్యార్థిని అనుమానాస్పద మృతి



**కమలానగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురంలోని ఓ ప్రైవేటు వసతి గృహంలో నందిని (19) అనే విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. నార్పల మండలానికి చెందిన విద్యార్థిని అనంతపురంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. ఇవాళ ఉదయం వసతి గృహ భవనం వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. గమనించిన తోటి విద్యార్థులు వసతి గృహ యాజమాన్యానికి సమాచారం ఇవ్వడంతో వారు పోలీసులకు విషయం తెలియజేశారు. రెండో పట్టణ పోలీసులు సంఘటన స్థలికి చేరుకొని పరిశీలించారు. విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందా..? మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## ఘోర ప్రమాదం.. రెండు బస్సులు ఢీకొని ఏడుగురి మృతి



**సూరత్, విశ్వం వాయిస్ న్యూస్ :** గుజరాత్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సూరత్ జిల్లా బర్డోలీ ప్రాంతంలో రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. 40 మందికిపైగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మంగళవారం సాయంత్రం మహారాష్ట్రకు చెందిన బస్సు.. బర్డోలీ వద్ద ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న మరో ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగినట్లు సూరత్ ఎస్పీ వెల్లడించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఈ రెండు బస్సులూ మహారాష్ట్ర ఆర్టీసీకి చెందినవేనని పోలీసులు తెలిపారు. ఈ బస్సులు పరస్పరం ఢీకొట్టుకోవడంతో ఒక బస్సులో మంటలు చెలరేగాయన్నారు. ఈ బస్సుల్లో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు బర్డోలీ పోలీసులు వెల్లడించారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సూరత్‌తో పాటు పక్కనే ఉన్న తాపి జిల్లా పోలీసులు సైతం ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపడుతున్నారని చెప్పారు.

**ప్రధాని తీవ్ర విచారం**

ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని.. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ కింద రూ. 2లక్షలు, క్షతగాత్రులకు రూ. 50వేలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## పోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు శిక్ష

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పోక్సో కేసులో 70 ఏళ్ల వృద్ధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెల్లడించింది. చాంద్రాయణగుట్టలో 2023లో మైనర్ బాలికపై లైంగిదాడి వ్యవహారంలో వృద్ధుడిపై కేసు నమోదైంది. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు మహ్మద్ జమీరుద్దీన్‌ను అరెస్టు చేశారు. ఆధారాలు పరిశీలించి, వాదోపవాదాలు విన్న కోర్టు.. ఈ కేసులో జమీరుద్దీన్‌ను దోషిగా తేల్చింది. అతడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 5వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

## ఆగిఉన్న లారీని ఢీ కొట్టిన కారు.. ఇద్దరి మృతి

**మిట్టపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని వెనక నుంచి కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. లారీ కింద కారు ఇరుక్కుపోవడంతో అందులోని మహిళ సహా ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. మృతులు, క్షతగాత్రులను మణుగూరుకు చెందిన వారిగా గుర్తించారు. సంఘటన స్థలికి చేరుకున్న పోలీసులు.. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించారు.

## తల్లీకూతుళ్ల దారుణ హత్య



**ఉంగుటూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అంధురాలైన కుమార్తె, ఆమె తల్లిని గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హతమార్చిన ఘటన ఏలూరు జిల్లాలో సోమవారం వెలుగు చూసింది. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన గంటా అంతూబాయి(60), రామారావు దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమార్తె మద్దా వెంకటలక్ష్మి(46) అంధురాలు. ఆమె ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. ఏలూరులోనే తల్లి, అంధుడైన సోదరుడు నాగబాబుతో కలిసి ఓ ఇంట్లో అద్దెకు నివసిస్తున్నారు. గత నెల 29న బంధువుల పుట్టినరోజు సందర్భంగా తల్లీకుమార్తె తూర్పుగోదావరి జిల్లా దూబచర్ల వెళ్లారు అప్పట్నుంచి ఇద్దరూ కనిపించడం లేదు. ఈ క్రమంలో ఉంగుటూరు మండలం నల్లమాడులోని జీడితోటలో ఇద్దరి మృతదేహాలు కుళ్లిన స్థితిలో ఉండటాన్ని యజమాని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అక్కడికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. ఇద్దరి తలలపై బలమైన గాయాలున్నట్లు గుర్తించారు. పదునైన ఆయుధంతో తలలపై మోది హతమార్చినట్లు అనుమానిస్తున్నారు. వెంకటలక్ష్మి భర్త సుదర్శనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

**పార్టీలో చీలికలపై కలత చెంది..**

## అన్నాడీఎంకే నాయకుడి ఆత్మహత్య



**చెన్నై (ఆర్కేనగర్), విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నాడీఎంకేలో అంతర్గత కలహాలపై కలత చెందిన ఆ పార్టీ నాయకుడొకరు.. చీలిక వర్గాలు ఏకమవ్వాలని కోరుతూ ఆత్మాహుతికి పాల్పడిన ఘటన తమిళనాడులో కలకలం సృష్టించింది. తంజావూర్ జిల్లా కుంభకోణం సమీపంలోని తిరుప్పందాల్ గ్రామానికి చెందిన మహేంద్రన్(37) అన్నాడీఎంకే వ్యాపార విభాగం ఉప కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఆదివారం రాత్రి తన ఫేస్‌బుక్ ఎకౌంట్‌లో ఓ వీడియో పోస్ట్ చేశారు. ఏఐఏడీఎంకేలో అంతర్గత కలహాలు తనను ఆవేదనకు గురిచేశాయని, చీలిక వర్గాలు ఏకమవ్వాలని, ఎడప్పాడి పళనిసామి నేతృత్వంలో పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని, తన మరణానంతరం కార్యకర్తలు, నాయకులంతా కలిసి పనిచేయాలని అందులో పేర్కొన్నారు. అనంతరం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మాహుతికి పాల్పడ్డారు. ఆయన మృతదేహానికి పార్టీ ప్రధాన కార్యదర్శి పళనిసామి నివాళులర్పించారు.

## ఆర్సీబీపై అభిమానం ముసుగులో అరాచకం

### బస్సులపైకి రాళ్లు, ఫ్లెక్సీల దహనం – 18 మంది అరెస్టు



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐపీఎల్ ఫైనల్‌లో ఆర్సీబీ గెలుపొందిన నేపథ్యంలో కర్నూలులో అభిమానం పేరుతో అరాచకం సృష్టించారు. విజయోత్సవాల పేరిట ఆదివారం రాత్రి కొందరు యువకులు గుంపులుగా తిరుగుతూ రహదారి పక్కన, డివైడర్లపై ఉండే ప్రకటన బోర్డులు, ట్రాఫిక్ బారికేడ్లను బండరాళ్లతో పగలగొట్టారు. విద్యుత్తు దీపాలనూ ధ్వంసం చేశారు. మరికొందరు ఫ్లెక్సీలను చించి రోడ్డుపైనే తగలబెట్టారు. ఆ సమయంలో హైదరాబాద్ వెళుతున్న ఆత్మకూరు డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులను అడ్డుకుని అద్దాలను ధ్వంసం చేశారు. మరో మూడు ప్రైవేట్ బస్సులపైనా రాళ్లు రువ్వారు. కొందరు బస్సులపైకి ఎక్కే ప్రయత్నం చేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు పరిస్థితిని అదుపు చేసేందుకు లాఠీఛార్జి చేశారు. అనంతరం వారు బస్సులకు రక్షణగా ఉండి పంపించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదోని, ఆళ్లగడ్డల్లోనూ కొందరు రెచ్చిపోయారు. ఈ విధ్వంసానికి సంబంధించి సీసీ టీవీ ఫుటేజీలు, సామాజిక మాధ్యమాల్లోని దృశ్యాల ఆధారంగా విధ్వంసానికి పాల్పడిన వారిని కర్నూలు పోలీసులు గుర్తించారు. 18 మందిని అరెస్టు చేశారు. నిందితుల్లో బేల్దారులు, ఇతరత్రా పనులు చేసుకునే కూలీలు, ఒక రౌడీషీటర్ ఉండగా ముగ్గురు బీటెక్ విద్యార్థులు ఉన్నారు. నిందితులను పోలీసుస్టేషన్ నుంచి ప్రధాన రహదారిపై నడిపించుకుంటూ కోర్టుకు తీసుకెళ్లారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులకు నోటీసులు ఇచ్చి పంపారు.

# వనిత వాయిస్

## వైఫల్యాల్ని అధిగమించి.. కెరీర్లో రాణించాలంటే..

వృత్తిఉద్యోగాల్లో మనం ఎన్నో లక్ష్యాలు పెట్టుకుంటాం.. వాటిలో కొన్ని సఫలమవ్వచ్చు.. మరికొన్ని విఫలమవ్వచ్చు. అయితే చాలామంది ఇలాంటి వైఫల్యాల గురించే ఆలోచిస్తూ ఇక తాము కెరీర్‌లో రాణించలేమనుకుంటారు. ఇతరులతో పోల్చుకుంటూ తీవ్ర ఒత్తిడిలోకి కూరుకుపోతుంటారు. నిజానికి ఇలాంటి ప్రతికూల భావాలే కెరీర్ తిరోగమనానికి కారణమవుతాయంటున్నారు నిపుణులు. అందుకే వైఫల్యాల్ని కూడా సానుకూలంగా స్వీకరించి.. వాటి నుంచి కొత్త పాఠాలు నేర్చుకోగలిగితే కెరీర్‌ను తిరిగి గాడిలో పెట్టుకోవచ్చంటున్నారు. మరి, కెరీర్‌లో విఫలమయ్యామని ఎప్పుడనిపిస్తుంది? దానిని అధిగమించి ముందుకు సాగడమెలాగో తెలుసుకుందాం రండి..

**ఇవే కారణమా?**

- ఏ పని చేయాలన్నా ప్రణాళిక ముఖ్యం. కెరీర్‌లో విజయవంతంగా ముందుకెళ్లాలన్నా ప్లానింగ్ తప్పనిసరి! అయితే కొంతమంది దీన్ని విస్మరిస్తుంటారు. ఎలాంటి ప్రణాళిక లేకుండా చేతికొచ్చిన పనిని చేసుకుంటూ ముందుకు సాగుతుంటారు. దీనివల్ల ఎంత పనిచేసినా సంతృప్తి కలగదు.. సరికదా కెరీర్‌లో ఆశించిన స్థాయిలో వృద్ధి లేక ఒకానొక సమయంలో విఫలమయ్యామన్న వైరాగ్య భావన ఆవహిస్తుంది.
- కొంతమంది కెరీర్‌లో అయినా, జీవితంలోనైనా సాధ్యం కాని లక్ష్యాల్ని నిర్దేశించుకుంటారు. వాటిని చేరుకునే క్రమంలో ఎంతో శ్రమ పడతారు.. కానీ ఆశించిన ఫలితం దక్కదు. ఇలాంటప్పుడు ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ఇది క్రమంగా విఫలమయ్యామన్న భావన కలిగేలా చేస్తుంది.
- చదువుకు తగ్గ ఉద్యోగం దొరక్క.. తాత్కాలికంగా ఏదో ఒక ఉద్యోగంలో చేరుతుంటారు కొందరు. ఇటు ఈ ఉద్యోగం చేస్తూనే.. తాము కోరుకున్న కెరీర్‌పై దృష్టి పెడుతుంటారు. ఒకవేళ ఆశించిన ఉద్యోగం లభించకపోతే ఒక రకమైన అసహనానికి, కెరీర్ విఫలమైందన్న భావనకూ లోనవుతుంటారు.
- ఉద్యోగంలో ఎవరి సామర్థ్యాలు వారివి! ఒకరికి అప్పగించిన పనిని వేగంగా పూర్తి చేయగలిగే సామర్థ్యముండచ్చు.. మరొకరికి ఎన్ని పనులైనా ఒంటి చేత్తో నిర్వహించే సత్తా ఉండచ్చు.. ఇంకొకరికి టెక్నాలజీపై పట్టుండచ్చు.. అయినా కొంతమంది తమ సామర్థ్యాల్ని పక్కన పెట్టి ఇతరులతో పోల్చుకుంటుంటారు. ఇది కూడా తాము కెరీర్‌లో విఫలమయ్యామన్న భావనను కలిగిస్తుందంటున్నారు నిపుణులు.
- కెరీర్‌ని విజయవంతంగా కొనసాగించాలంటే ఆరోగ్యం కూడా అందుకు సహకరించాలి. అయితే కొంతమందిలో పలు శారీరక సమస్యలుండచ్చు.. మరికొంతమందికి వ్యక్తిగత/వృత్తిపరమైన కారణాల వల్ల మానసిక సమస్యలు



ఎదురుకావచ్చు. ఇలాంటి సమయంలో చేసే పనిపై పూర్తి దృష్టి పెట్టలేం. దాంతో అటు కెరీర్‌లో వృద్ధి, ఇటు వ్యక్తిగత జీవితంలో సంతృప్తి లేవన్న భావన వెంటాడుతుంది.

- కొంతమంది కెరీర్‌లో పూర్తి చేయాల్సిన లక్ష్యాల్ని పకడ్బందీగా నిర్దేశించుకుంటారు. కానీ వాటిని ఆచరణలో పెట్టే విషయంలో జాప్యం చేస్తుంటారు. పనుల్ని పూర్తిచేసే విషయంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. దీనివల్ల కూడా లక్ష్యాల్ని సరైన సమయంలో చేరుకోలేక.. విఫలమయ్యామన్న భావన దరిచేరుతుందంటున్నారు నిపుణులు.
- వృత్తిఉద్యోగాల్లో మనం ఎంత చురుగ్గా వ్యవహరించినా.. మన చుట్టూ ఉన్న కొందరు మనల్ని వెనక్కి లాగాలని చూస్తుంటారు. విమర్శలు, నెగెటివ్ మాటలతో మనలో ప్రతికూల భావనలు కలిగేలా చేస్తారు. ఇలాంటి వ్యక్తులకు ప్రభావితమైనా కెరీర్‌లో ఏమీ సాధించలేకపోతున్నామన్న భావన కలగడం సహజం.
- కొంతమంది విషయంలో కెరీర్ ప్రణాళిక అంతా బాగానే ఉంటుంది.. కానీ ఆయా పనులు పూర్తిచేయడానికి సంబంధించిన ఉత్సాహం కొరవడుతుంది. దీనివల్ల కూడా పనులు అనుకున్న సమయానికి పూర్తికాక.. కెరీర్ విఫలమైందన్న ఒక రకమైన అసహనం దరిచేరుతుంది.

**అధిగమిస్తేనే అందలం!**

- జీవితంలోనైనా, కెరీర్ పరంగానైనా.. తమకెదురైన వైఫల్యాల్ని చాలామంది స్వీకరించరు. తమకే ఎందుకిలా? అన్న ప్రతికూల భావనలోకి కూరుకుపోతారు. కానీ ఇలా ఆలోచించడం కంటే.. 'జరిగిందేదో జరిగిపోయింది.. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్తపడాల'న్న సానుకూల దృక్పథంతో ముందుకు సాగినప్పుడే.. కెరీర్ వృద్ధి సాధ్యమవుతుందంటున్నారు నిపుణులు.
- 'ఓటమి గెలుపుకి తొలి మెట్టు' అంటారు. అంటే.. ఓటమికి గల కారణాల్ని పసిగట్టి.. వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటూనే.. అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా జాగ్రత్తపడినప్పుడే కెరీర్ వైఫల్యాల్ని సులభంగా అధిగమించచ్చంటున్నారు నిపుణులు.
- 'నా పనేదో నాది.. ఇతరులతో సంబంధం లేదన్న'ట్లుగా పని ప్రదేశంలో కొంతమంది రిజర్వ్‌డ్‌గా వ్యవహరిస్తుంటారు. కెరీర్‌లో వెనకబడినప్పుడు ఇలాంటి వారికి తోటి వారి నుంచి ఎలాంటి సహాయం అందదు. కాబట్టి వృత్తిఉద్యోగాల్లో తోటి ఉద్యోగులతో సత్సంబంధాలు ఏర్పరచుకోవడం, ఇతర సంస్థల్లో పనిచేసే స్నేహితులతో స్నేహబంధం కొనసాగించడం వల్ల.. కెరీర్‌లో ఎదురయ్యే సమస్యల్ని అధిగమించడం సులభమవుతుందంటున్నారు నిపుణులు.
- ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న ఎంతోమంది తమ కెరీర్ మొదట్లో వైఫల్యాలను ఎదుర్కొన్న వారే! కాబట్టి వాళ్ల స్ఫూర్తి గాథల గురించి తెలుసుకుంటే ప్రోత్సాహకరంగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాల్లో ప్రతికూలతల్ని ఎలా అధిగమించాలో కూడా వాళ్ల నుంచి నేర్చుకోవచ్చు.
- వైఫల్యాలు ఎదురయ్యాయని వాటినే తలచుకుంటే అక్కడే ఆగిపోతాం. అదే ఆ ప్రతికూల ఆలోచనల్ని అధిగమించి.. ఆసక్తి ఉన్న అంశాలపై దృష్టి పెడితే.. కొత్త విషయాలు నేర్చుకోగలుగుతాం.. ఇదీ పరోక్షంగా మన కెరీర్‌కి ప్లస్ అవుతుంది.
- ఎంత నేర్చుకున్నా, ఎన్ని నైపుణ్యాల్లో పట్టు సాధించినా నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే మన కెరీర్ అవకాశాల్ని విస్తరించుకోగలుగుతాం. అందుకే వైఫల్యాల్ని పక్కన పెట్టి మీ చదువుకు తగ్గ ఇతర కెరీర్ అవకాశాలపై దృష్టి పెట్టమంటున్నారు నిపుణులు. దీనివల్ల ఇటు కెరీర్ అభివృద్ధి సాధించచ్చు.. అటు ఆర్థికంగానూ మరింత దృఢం కావచ్చు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...




బుధవారం, 03 జూన్, 2026

www.viswamvoice.com






# మండలంలో అక్రమ మట్టి తవ్వకాల జోరు!

- కఠిన చర్యలు తప్పవంటున్న అధికారులు
- భారీగా లోడుతో ట్రాక్టర్ల రాకపోకలతో గ్రామ ప్రజల బేజారు
- అధ్వాన్నమై పోతున్న రహదారులపై ఆవేదనల హోరు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం తీరు

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు రోజు రోజుకు విస్తరిస్తున్నాయనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సోమేశ్వరం, మాచవరం, రాయవరం, వెదురుపాక, వెంటూరు గ్రామాల పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ భూములను భారీ యంత్రాలతో తవ్వి, ట్రాక్టర్ల ద్వారా రాత్రింబవళ్లు మట్టిని తరలిస్తున్న దృశ్యాలు స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. అక్రమంగా తవ్విన మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తూ కొందరు భారీగా లాభాలు ఆర్జిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పలు గ్రామాల మధ్య రహదారులపై వందల సంఖ్యలో ట్రాక్టర్లు నిరంతరం తిరుగుతుండటంతో గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మాచవరం నుండి అచ్యుతాపురం వెళ్లే మార్గం, అలాగే రాయవరం నుండి పసలపూడి గ్రామానికి పొలాల మధ్యుగా వెళ్లే రహదారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. భారీ లోడ్లతో తిరుగుతున్న ట్రాక్టర్ల కారణంగా రోడ్లు గుంతలమయంగా మారడం తో పాటు , పెద్ద కంకర రాళ్లు వాహనాల ఒత్తిడికి అధికంగా లేచిపోవడంతో కాలినడకన వెళ్లడమే కష్టసాధ్యమైందని వాపోతున్నారు. రైతులు సైకిళ్లపై ప్రయాణించడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొందని, పశుగ్రాసం తీసుకురావడానికే ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అధిక వేగంతో దూసుకెళ్తున్న ట్రాక్టర్లు గ్రామాల్లో ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు సృష్టిస్తున్నాయని, ముఖ్యంగా మైనర్లు ట్రాక్టర్లు నడుపుతున్న ఘటనలు అధికంగా కనిపిస్తున్నాయని, దీంతో ప్రమాద భయం మరింత పెరిగిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో ఆడుకునే పిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని. "అనుమతులు లేకుండా ఇంత భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు, రవాణా ఎలా జరుగుతున్నాయి..? అధికారులు ఎందుకు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు..?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**మట్టి తవ్వకాలకు అనుమతులు తప్పనిసరా?**

సాధారణంగా వ్యవసాయ భూములు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు లేదా ఇతర ప్రాంతాల్లో మట్టి తవ్వకాలు చేపట్టాలంటే రెవెన్యూ శాఖ, మైనింగ్ శాఖల నుండి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలి. ఎక్కడ తవ్వాలి, ఎంత పరిమాణంలో తవ్వాలి, ఎక్కడికి తరలించాలి అనే పూర్తి వివరాలతో అధికారిక అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. పర్యావరణ పరిరక్షణ, సేల్స్ టాక్స్ ద్వారా వచ్చే ప్రభుత్వ ఆదాయం, రహదారుల భద్రత వంటి అంశాల దృష్ట్యా ఈ నిబంధనలు అమల్లో ఉన్నాయి. అనుమతులు లేకుండా మట్టి తవ్వడం, రవాణా చేయడం మైనింగ్ నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. ఇలాంటి సందర్భాల్లో రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేయడం, కేసులు నమోదు చేయడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

**నిబంధనలు మీరుతున్నా మౌనం ఎందుకు.?**

రాయవరం మండలంలో ఈ నిబంధనలు అమలవుతున్నాయా లేదా అన్న సందేహాలు ఇప్పుడు బలంగా వ్యక్తమవుతున్నాయి. ఖచ్చితమైన సమాచారం, ఫిర్యాదులు, ప్రత్యక్ష ఆధారాలు ఉన్నప్పటికీ సంబంధిత శాఖలు స్పందించకపోవడం వెనుక కారణాలేమిటన్నది ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజలు ఒక ముఖ్యమైన ప్రశ్నను లేవనెత్తుతున్నారు. "సామాన్యుడు తన ఇంటి అవసరాల కోసం కొద్దిపాటి మట్టిని తీసుకెళ్తే కేసులు నమోదు చేసే అధికారులు, భారీ స్థాయిలో జరుగుతున్న అక్రమ మట్టి రవాణాపై మాత్రం ఎందుకు మౌనం వహిస్తున్నారు..?" అంటూ ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఇటుక బట్టీలకు పెద్ద ఎత్తున మట్టిని తరలిస్తున్నప్పటికీ అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. కాగా ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళగా అక్రమ మట్టి రవాణా కార్యకలాలపై ప్రత్యేక బృందాన్ని నియమించి మట్టిని తరలించకుండా అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

**తక్షణమే చర్యలు చేపట్టాలి**




గ్రామీణ రహదారులు పూర్తిగా దెబ్బతినడం, దుమ్ము కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడడం, ప్రమాదాలు పెరుగుతున్న పరిస్థితుల్లో ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి, అనుమతులు లేకుండా తిరుగుతున్న ట్రాక్టర్లను సీజ్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అక్రమ మట్టి రవాణాను ఉపేక్షించేది లేదు..



మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తపకాలపై మండల తహసీల్దార్‌ను స్పందిస్తూ "రాయవరం మండలంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయన్న సమాచారం మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాం. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘిస్తూ మట్టి తరలింపు జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. అవసరమైతే మైనింగ్, పోలీస్ శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం. ప్రజలు కూడా అక్రమ మట్టి తవ్వకాలపై సమాచారం అందిస్తే వెంటనే స్పందించి చర్యలు చేపడతామన్నారు".

**బి.వి భాస్కర్, మండల రెవెన్యూ అధికారి, రాయవరం.**

అనపర్తి పోలీస్ స్టేషన్‌లో

## నూతనంగా అదనపు కార్యాలయ గదుల ప్రారంభం



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసు సేవలు అందించడంతో పాటు పోలీసు సిబ్బందికి మెరుగైన కార్యాలయ వసతులు కల్పించే లక్ష్యంతో అనపర్తి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు కార్యాలయ గదులను జిల్లా తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్లలో మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా పోలీసు సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడి, ప్రజలకు వేగవంతమైన మరియు నాణ్యమైన సేవలు అందించడానికి దోహదపడుతుందని తెలిపారు. ఆధునిక అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన ఈ అదనపు కార్యాలయ గదులు సిబ్బందికి అనుకూ లమైన పని వాతావరణాన్ని కల్పిస్తాయని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ల ఆధునికీకరణ, సౌకర్యాల విస్తరణ ద్వారా స్మార్ట్ పోలీసింగ్ లక్ష్యాలను మరింత సమర్థవంతంగా అమలు చేయవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ డిఎస్పి బి.విద్య, సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.ఎల్.వి.కె. సుమంత్,ఎస్సైలు ఎల్.శ్రీను నాయక్, బి.దుర్గ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ 6న మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా

**నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు : జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్.శిరీష**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జూన్ 6వ తేదీ (శనివారం) ఉదయం 10 గంటలకు రాజమహేంద్రవరం తాడితోట, మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.హెచ్. శిరీష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిరకల్ సాఫ్ట్‌వేర్, ఠాగూర్ సంస్థలలోని పలు ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ లేదా పీజీ అర్హత కలిగి, 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు పాల్గొనవచ్చున్నారు. ఎంపికైన వారికి తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు employment.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని, రెజ్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9533221189 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

నేరస్తులు, రౌడీషీటర్లు

## సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

**రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించిన జిల్లా పోలీసులు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, ఆదేశాల మేరకు నేరనియంత్రణ మరియు శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తుల కోసం కౌన్సిలింగ్ కార్యక్రమాలను నిర్వహించారు. పోలీస్ ఉన్నత అధికారులు రౌడీషీటర్లుతో మాట్లాడుతూ నేరాలకు దూరంగా ఉండాలి, సత్ప్రవర్తనతో జీవించాలి. అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవు. గంజాయి, మత్తుపదార్థాల వినియోగం లేదా రవాణా చేస్తే తీవ్ర చర్యలు తీసుకుంటామని. చెడు వ్యసనాలను మాని, మంచి నడవడికను అలవర్చుకోవాలి. సమాజంలో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకూడదని హెచ్చరించారు. రౌడీ షీటర్లు, క్రైమ్ సస్పెక్ట్‌ల కదలికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నారని, వారి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎటువంటి గొడవలు, నేరాలలో పాల్గొన్నా వెంటనే లీగల్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, భవిష్యత్తులో ఏవైనా చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆర్మీ ఐడి కార్డ్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు మండలం, ఎస్.చిక్కాల గ్రామానికి చెందిన మాజీ సైనికుడు ముప్పిడి రాజబాబును అనారోగ్య కారణాల రీత్యా వైద్య సేవల నిమిత్తం ఏప్రిల్ 24న పాలకొల్లు నుండి ఏలూరు తరలిస్తున్న సమయంలో మార్గమధ్యంలో ఆయన భార్య ముప్పిడి రత్న దోరతి హ్యాండ్ బ్యాగ్ పోయింది. ఆ బ్యాగులో విలువైన ఈసీహెచ్ఎస్ స్మార్ట్ కార్డు పోగొట్టుకున్నారు. ఈ కార్డు ఎవరికైనా దొరికిన యెడల ఈ నంబర్లలో సంప్రదించగలరు.

**9121881934, 9949599206**

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎడిషన్

బుధవారం, 03 జూన్ 2026
www.viswamvoice.com







### జనుపల్లె అమ్మవారి ఆలయ స్థలంలో

# ప్రభుత్వ కార్యాలయం వద్దు

- భక్తుల మనోభావాలను గౌరవించాలి ప్రత్యామ్నాయ స్థలంలో వాతావరణ శాఖ కార్యాలయం నిర్మించాలి
- అభివృద్ధికి వ్యతిరేకం కాదు.. ఆలయ సంప్రదాయాలకు భంగం కలగకూడదు
- గ్రామదేవత ఉత్సవాల ప్రాంగణాన్ని కాపాడాలని జనుపల్లె ప్రజల డిమాండ్
- అమ్మవారి ఆలయ పక్కన కార్యాలయం నిర్మాణ ప్రతిపాదనపై గ్రామస్తుల తీవ్ర ఆవేదన






**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలంలోని జనుపల్లె గ్రామదేవత జనుపల్లె అమ్మవారి ఆలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో వాతావరణ శాఖ కార్యాలయ భవనం నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిసిందని, అయితే ఆ స్థలంలో కార్యాలయం నిర్మించడం గ్రామ ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జనుపల్లె అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ 16వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు మీడియాతో మాట్లాడుతూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. గ్రామదేవత జనుపల్లె అమ్మవారి ఆలయం గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు కేంద్రబిందువుగా ఎన్నో దశాబ్దాలుగా కొనసాగుతోందని తెలిపారు. ఆలయం పక్కన ఉన్న ఖాళీ స్థలం కేవలం ఒక భూమి ముక్క మాత్రమే కాదని, గ్రామ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, సామూహిక కార్యక్రమాలకు నిలయంగా ఉందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం అమ్మవారి వార్షికోత్సవాలు, జాతరలు, అన్నసమారాధన కార్యక్రమాలు, భక్తి కార్యక్రమాలు, గ్రామస్థాయి సమావేశాలు, వివిధ ధార్మిక క్రతువులు ఈ ప్రదేశంలోనే నిర్వహిస్తున్నామని వివరించారు. గ్రామానికి సంబంధించిన అనేక సామాజిక, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాలు ఈ స్థలాన్ని కేంద్రంగా చేసుకొని జరుగుతున్నాయని, తరతరాలుగా గ్రామ ప్రజలు ఈ ప్రదేశాన్ని పవిత్ర స్థలంగా భావిస్తూ వస్తున్నారని తెలిపారు. ఇలాంటి ప్రాముఖ్యత కలిగిన స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయ నిర్మాణానికి వినియోగించడం వల్ల గ్రామ సంప్రదాయాలకు, భక్తుల మనోభావాలకు తీవ్ర భంగం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమ జిల్లా ఏర్పడిన అనంతరం వాతావరణ శాఖ కార్యాలయ నిర్మాణానికి జనుపల్లె గ్రామాన్ని ఎంపిక చేయడం సంతోషకరమైన విషయమేనని, ప్రభుత్వ శాఖలు గ్రామాలకు రావడం అభివృద్ధికి సంకేతమని గ్రామస్తులు పేర్కొన్నారు. అయితే కార్యాలయం నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం మాత్రమే తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. గ్రామంలో ప్రభుత్వ భవనం నిర్మించేందుకు అనువైన ఇతర ప్రభుత్వ భూములు లేదా ప్రత్యామ్నాయ స్థలాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే గ్రామ ప్రజలంతా కలిసి తగిన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అభివృద్ధి పేరుతో గ్రామ ప్రజల సాంప్రదాయ, ఆధ్యాత్మిక అవసరాలను విస్మరించకూడదని వారు కోరారు. ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామ పరిస్థితులను పరిశీలించి, స్థానిక ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల విశ్వాసాలు, సంప్రదాయాలు, భావోద్వేగాలను గౌరవించడం కూడా ప్రజాస్వామ్య పాలనలో ముఖ్యమైన భాగమని గ్రామస్తులు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఈ స్థలం గ్రామ ప్రజల సామూహిక ఆస్తిగా, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిందని, అందువల్ల వాతావరణ శాఖ కార్యాలయం నిర్మాణం కోసం ఈ స్థలాన్ని వినియోగించే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పునఃపరిశీలించి విరమించుకోవాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా కోరారు. గ్రామ ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, గ్రామ సంప్రదాయాలకు భంగం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలంలో వాతావరణ శాఖ కార్యాలయాన్ని నిర్మించాలని వారు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్, గ్యాస్ పంపిణీలో అవకతవకలకు తావులేదు

### ద్రాక్షారామంలో డీఎస్ఓ ఆకస్మిక తనిఖీలు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రేషన్ సరుకులు, వంటగ్యాస్ పంపిణీలో ఎలాంటి అవకతవకలు జరిగినా సహించేది లేదని, ప్రతి డీలర్, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ద్రాక్షారామ పరిసర ప్రాంతాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిత్యావసర వస్తువుల పంపిణీ, గ్యాస్ సిలిండర్ల సరఫరా సక్రమంగా జరుగుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. తనిఖీల్లో భాగంగా మూడు ప్రాంతాల్లో రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. ముందుగా ద్రాక్షారామంలోని మండల స్థాయి నిత్యావసర వస్తువుల నిల్వ కేంద్రాన్ని (స్టాక్ పాయింట్) సందర్శించారు. అక్కడ నిల్వ ఉంచిన బియ్యం, ఇతర నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించి, రికార్డుల్లో నమోదైన నిల్వలకు గిడ్డంగిలో ఉన్న వాస్తవ స్టాక్ సరిపోతుందా లేదా అని తనిఖీ చేశారు. రేషన్ దుకాణాలకు సరుకుల రవాణాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ద్రాక్షారామంలోని రవీంద్ర ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేశారు. గ్యాస్ సిలిండర్ల స్టాక్ రిజిస్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. వినియోగదారులకు గ్యాస్ డెలివరీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సిలిండర్లను సరఫరా చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. సిలిండర్ల బరువులో ఎటువంటి తేడాలు రాకుండా చూడాలని సూచించారు. తదుపరి అన్నయ్యపేటలోని చౌక ధరల దుకాణం నంబర్--9ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ-పోస్ యంత్రాల పనితీరు, దుకాణంలోని స్టాక్‌ను పరిశీలించారు. కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, తూకాల్లో ఎటువంటి వ్యత్యాసాలు ఉండకూడదని డీలర్‌ను ఆదేశించారు. ఈ తనిఖీలలో పౌర సరఫరాల శాఖ స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైల్వే జోన్ ఘనత ఎవరిది... భుజాలు తడుముకోవాల్సిందే..!




విశాఖ రైల్వే జోన్ కల ఎట్టకేలకు సాకారం అయింది. ఇది అర్ధ శతాబ్దం కల అన్నది తెలిసిందే. 1970 ప్రాంతంలో విశాఖ లోక్ సభ సభ్యుడు తెన్నేటి విశ్వనాథం పార్లమెంట్ లో తొలిసారి విశాఖ రైల్వే జోన్ గురించి గళం విప్పారు. ఆ తరువాత అది ఇంతదాకా సాగుతూ వచ్చింది. మొత్తానికి జూన్ 1న అధికారికంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రారంభం అయింది. ఈ క్రెడిట్ మాది అంటే మాది అని కూటమి పార్టీలతో పాటు ప్రతిపక్ష వైసీపీ అలాగే వామపక్షాలు కాంగ్రెస్ కూడా అంటున్నాయి. మరి ఇంతకీ రైల్వే జోన్ ఘనత ఎవరిది అంటే అందరిదీ అని ఒక్క ముక్కలో జవాబు చెప్పాల్సి వస్తుంది. అంతే కాదు ఒక జీవిత కాలం లేట్ అయింది కూడా జనాల అభిప్రాయంగా ఉంది. మరో వైపు రైల్వే జోన్ రావడానికి రాజకీయ అనివార్యతలే కారణం అయ్యాయి తప్పించి పోరాటల వల్ల జరిగింది కొంత శాతం మాత్రమే అన్న నిష్టూరమైన విశ్లేషణ సైతం వినిపిస్తోంది.

**బీజేపీ అనుకుంటే కనుక :** రైల్వే జోన్ కోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేశామని బీజేపీ నేతలు చెబుతున్నారు. అందువల్ల మా ఘనత జోన్ రావడం అని క్లెయిం చేసుకుంటున్నారు. నిజానికి చూస్తే ఈ మూడు దశాబ్దాలలో కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నదే 18 ఏళ్ళు అంటే మెజారిటీ కాలం అన్న మాట. మరి ఇంతకాలం అధికారంలో ఉంటే పోరాడడం ఎందుకు ఏనాడో కల సాకారం కావాలి కదా అన్నది మేధావుల నుంచి వస్తున్న ప్రశ్న. వాజ్ పేయ్ ప్రధానిగా ఉన్నపుడే దేశంలో రైల్వే జోన్లు అధికం అయ్యాయి. ఆనాడు రైల్వే మంత్రులుగా ఉన్న వారు అంతా తమ సొంత రాష్ట్రాలకు జోన్లు తెచ్చుకున్నారు. ఆ సమయంలో ఏపీకి ఎందుకు రైల్వే జోన్ ఇవ్వలేదు అన్న ప్రశ్నకు కమలనాథులు జవాబు చెప్పాలి కదా అని అంటున్నారు. ఇక 2014 నుంచి మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉంది. విభజన చట్టంలో కూడా రైల్వే జోన్ పెట్టారు. కానీ బీజేపీ మాత్రం పుష్కర కాలం తాత్సారం చేసి ఈ రోజుకు జోన్ ఇచ్చిందంటే దాని వెనక రాజకీయ అనివార్యతలు ఉన్నాయన్నది మరి కొందరి మాటగా ఉంది.

**టీడీపీ సైతం :** ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే 1999 నుంచి 2004 మధ్యలో వాజ్ పేయి ప్రభుత్వానికి ప్రాణ వాయువు లాంటి మద్దతుని అందించింది. ఆ సమయంలో రైల్వే జోన్ కోసం విశాఖలో ఉద్యమాలు జరిగాయి. కానీ కేంద్రం మీద టీడీపీ ఎందుకు ఒత్తిడి తీసుకుని రాలేదని కూడా ప్రజా సంఘాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. అలాగే 2014 నుంచి 2018 దాకా నాలుగేళ్ళ పాటు కేంద్రంలో బీజేపీతో టీడీపీ కలసి ఉంది. ప్రభుత్వంలో మంత్రులు కూడా ఉన్నారు. మరి ఈ నాలుగేళ్ళ కాలంలో అయినా రైల్వే జోన్ ఎందుకు తేలేకపోయారు అని విపక్షాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి.

**వైసీపీ విషయం తీసుకుంటే :** ఇక వైసీపీ 2019 నుంచి 2024 వరకూ ఏపీలో అధికారంలో ఉంది. 2019 ఎన్నికల ముందు విశాఖ వచ్చిన ప్రధాని మోడీ రైల్వే జోన్ ఇచ్చామని జీవోని సభలో ప్రదర్శించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఆ విషయం మీద ఎందుకు పోరాడలేదని ప్రశ్నిస్తున్నారు. తాము అధికారంలో ఉన్న అయిదేళ్ళ కాలంలో జోన్ ని వేగవంతంగా వచ్చేలా చేసి ఉంటే క్రెడిట్ తీసుకునే అవకాశం ఉండది కదా అని అంటున్నారు

**విభజన తరువాత కానీ :** ఇక కాంగ్రెస్ కేంద్రంలో యూపీఏ ప్రభుత్వాన్ని రెండు సార్లు పదేళ్ళ పాటు నడిపింది. ఆ సమయంలో విశాఖ రైల్వే జోన్ అన్నది ఎందుకు ఇవ్వలేకపోయింది అని ప్రశ్నిస్తున్నారు విభజన జరిగితే తప్ప కాంగ్రెస్ కి గుర్తు రాలేదా అని కూడా అడుగుతున్నారు. వామపక్షాలు మొదటి యూపీఏ ప్రభుత్వంలో భాగస్వాములు. మరి వారు వీధి పోరాటాలతో పాటు కేంద్రంలో ఎందుకు ఒత్తిడి పెంచలేకపోయారు అన్నది కూడా మరో ప్రశ్న. ఏతా వాతా తేలేది ఏంటి అంటే రైల్వే జోన్ కోసం అందరూ పోరాటాలు చేశారు. ఉద్యమించారు, కానీ జోన్ వచ్చింది మాత్రం రాజకీయ అనివార్యతల వల్లనే అని విశ్లేషిస్తున్నారు. అది కూడా బీజేపీ ఇవ్వాలనుకుంది ఇచ్చింది అని గుర్తు చేస్తున్నారు.

**పూర్తి జోన్ వచ్చినట్లేనా :** సరే ఇంతకీ పూర్తి జోన్ వచ్చిందా అంటే ఇంకా రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ రావాల్సి ఉందని అంటున్నారు. అలాగే వాల్తేరు డివిజన్ ని రెండు ముక్కలు చేసి ఆదాయం వచ్చే కేకే లైన్ ని రాయగడలో కలిపేశారు. దానిని తిరిగి విశాఖ డివిజన్ లో కలపాలని కూడా డిమాండ్ ఉంది. ఇవన్నీ జరిగిన తరువాతనే రైల్వే జోన్ వచ్చినట్లు అని గట్టిగా ఎవరైనా చెప్పుకోవాల్సి ఉంటుందని అంటున్నారు.

### మడికి అంతర్రాష్ట్ర రైతు కూరగాయల

# మార్కెట్ అధ్యక్షుడిగా సుబ్బరాజు





**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో మడికి శ్రీ అభయ ఆంజనేయ స్వామి రైతు అంతరాష్ట్ర కూరగాయల మార్కెట్ కార్యవర్గ నూతన అధ్యక్షుడిగా దొండపాటి సుబ్బరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మార్కెట్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా దొండపాటి సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా నల్లా వీరబాబు, కరాటి శ్రీను, సెక్రటరీగా పర్వతనేని సతీష్, ట్రెజరర్‌గా పి.శ్రీనుతో పాటు మరికొంతమంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ కార్యవర్గ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుబ్బరాజు మాట్లాడుతూ ఇటు రైతులకు అటు వ్యాపారస్తులకు ఎటువంటి నష్టము వాటిల్లకుండా సమన్వయం చేసుకుంటూ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల నుండి వ్యాపారస్తులు ఈ మార్కెట్ కు వచ్చి కూరగాయలు కొనుగోలు చేస్తున్నారని ఈ మార్కెట్ కు మరింత పేరు ప్రతిష్టలు పెంచేందుకు మార్కెట్ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకుని గుర్తింపు తెచ్చేందుకు అన్ని విధాల కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పాలూరి సత్తిబాబు, చెల్లబోయిన సింహాచలం, అయినవిల్లి సత్తిబాబు, దొండపాటి వెంకన్న (బులిరెడ్డి), పర్వతనేని రామారావు (అబ్బు), అందే బుజ్జి, అన్యం నాగేష్, కొత్తపల్లి శ్రీను, కొత్తపల్లి పాపారాయుడు (బుజ్జి), సుధీర్, డి.పెద్దకాపు, అయినవిల్లి నగేష్, సీతారెడ్డి, పలువురు మార్కెట్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# కుటుంబ సభ్యులను పరామర్శించిన బండారు సందీప్

### ఉపాధి కూలీ మృతి బాధాకరం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన చామకూర హనుమంతరావు ఉపాధి హామీ పథకంలో భాగంగా మంగళవారం ఉదయం పనికి రాగా ఫోటో తీసుకునే సమయంలో గుండెపోటుతో చనిపోవడం బాధాకరం. వారి మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి న్యాయం జరిగేలా ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు దృష్టికి తీసుకు వెళతాం అని సందీప్ చెప్పడం జరిగింది నాయకులు తెలిపారు. ఎండ వేడి గాల్పులు బారిన పడకుండా వైద్య అధికారులు చెప్పిన విధంగా ముందస్తు చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాలని కోరుతున్నాము అని కొత్తపేట ఏ యం సి మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు,కొత్తపేట మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్,బుసి భాస్కర్ రావు,ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, గంటి గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పంట కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం





**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధిలోని చొప్పెల్ల 216(ఏ)నెంబర్ గల జాతీయ రహదారి చెంతన ఉన్న కెనాల్ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు 40 సంవత్సరలు ఏళ్లలోపు వయసున్న వ్యక్తి గులాబి రంగు టీషర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు.

# ఎస్ఐఆర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వర్క్‌షాప్‌లో రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ మరియు ఇన్సూరెన్స్ శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియ, ఓటరు నమోదు, ఓటరు జాబితాల పరిశీలన, పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు,మంత్రి సుభాష్ తో పాటు, అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్, ఎంపీ సానా సతీష్, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఓటరు జాబితాల పటిష్టీకరణ, ప్రతి అర్హుడైన ఓటరు పేరు నమోదుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

# 'వెన్నుపోటుకు రెండేళ్లు' పోస్టర్, బుక్‌లెట్ ఆవిష్కరణ

### చంద్రబాబు పాలనపై వైఎస్సార్సీపీ పోరుబాట

### అమలాపురంలో వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పిలుపు మేరకు అమలాపురం భట్నవిల్లిలో మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసంలో చంద్రబాబు రెండేళ్ల పాలనపై వైఎస్సార్సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా "వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో పోస్టర్, బుక్‌లెట్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, ముమ్మిడివరం నియోజకవర్గ సమన్వయకర్త పొన్నాడ సతీష్, రాజోలు నియోజకవర్గ సమన్వయకర్త పాముల రాజేశ్వరి దేవి, పి. గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాసరావు, పి. గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాస్ రాజు, కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు పేరి కామేశ్వరరావు, కేఎస్ఎన్ రాజు, రాష్ట్ర కార్యనిర్వాహక మండలి సభ్యులు కుడుపూడి భరత్, సాక మణికుమారి, బాలముని కుమారి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, కర్రీ నాగిరెడ్డి, వంటెద్దు వెంకయ్య నాయుడు, కటకంశెట్టి ఆదిత్య, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పాముల ప్రకాష్, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి కంచర్ల శేఖర్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి గుబ్బల మనోహర్, అమలాపురం టౌన్ అధ్యక్షుడు సంసాని నాని, పి. గన్నవరం మండల అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, పి. గన్నవరం నియోజకవర్గ బూత్ కన్వీనర్ల అధ్యక్షుడు గన్నవరపు సాయి ప్రసాద్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల ముద్రణకు ఆర్బీఐ కసరత్తు...!

**నకిలీ నోట్లకు చెక్‌పెట్టేలా ఫీచర్లు - ఎక్కువ కాలం మన్నిక..**

**అధికారిక ప్రకటన వెలువడాలి - దేశ చలామణీలో రూ.47 లక్షల కోట్ల నకిలీ నోట్లు**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుతం కాగితంతో తయారు చేస్తున్న కరెన్సీకి ప్రత్యామ్నాయంగా ప్లాస్టిక్ (పాలిమర్) నోట్లను చలామణిలోకి తీసుకు రావాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) యోచిస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక ప్రకారం భారతదేశంలోని బ్యాంకింగ్ వ్యవస్థలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2,29,746 నకిలీ నోట్లను గుర్తించారు. ఇది గత సంవత్సరంతో పోలిస్తే 5.7 శాతం అధికం. ప్రస్తుతం దేశంలో రూ.47 లక్షల కోట్ల అనధికార (నకిలీ) కరెన్సీ నోట్లు చలామణిలో ఉన్నట్టు అనధికార సమాచారం. ఈ నకిలీ కరెన్సీని అరికట్టడానికి, ముద్రణ ఖర్చులను తగ్గించడానికి నోట్ల మన్నికను పెంచడానికి ఈ పాలిమర్ నోట్లను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. సాధారణ నోట్లు పత్తి మరియు కాగితంతో తయారవుతాయి. కానీ పాలిమర్ నోట్లను బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీప్రొఫైలిన్ అనే సింథటిక్ ప్లాస్టిక్ పదార్థంతో తయారు చేస్తారు. ఇవి క్రెడిట్, డెబిట్ కార్డుల మాదిరిగా గట్టిగా కాకుండా, కాగితం నోట్లలాగే మడవడానికి వీలుగా పల్చగా, సౌకర్యవంతంగా ఉంటాయి. ఇవి సాధారణ కాగితపు నోట్ల కంటే కొన్ని రెట్లు ఎక్కువ కాలం పాటు మన్నుతాయి. నీరు, మురికిని తట్టుకుంటాయి: ఇవి అంత సులభంగా చినిగిపోవు. నీళ్లలో పడినా, మురికి చేరినా పాడైపోవు. వీటిలో ప్రత్యేకమైన మైక్రో ఆప్టిక్ హోలోగ్రామ్‌లు, పారదర్శక గవాక్షం వంటి పటిష్టమైన భద్రతా ఫీచర్లు ఉంటాయి. కాబట్టి నకిలీ నోట్లను తయారు చేయడం దాదాపు అసాధ్యం. ఇవి 100 శాతం రీసైకిల్ చేయడానికి అనువుగా ఉంటాయి. కాగితపు నోట్లను తరచూ మార్చడం వల్ల చెట్లకు పడే భారం తగ్గుతుంది. ప్రపంచంలో మొట్ట మొదటి సారిగా 1988లో ఆస్ట్రేలియా పాలిమర్ కరెన్సీని ప్రవేశపెట్టింది. 1996 నాటికి ఆ దేశంలో పూర్తిగా పాలిమర్ నోట్లు మాత్రమే వాడుకలోకి వచ్చాయి. ఆ



తర్వాత కెనడా, న్యూజిలాండ్, రొమేనియా తదితర దేశాలు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేశాయి. భారత దేశంలో తొలుత రూ. 10 వంటి చిన్న నోట్లతో ఈ పాలిమర్ కరెన్సీని ప్రయోగాత్మకంగా పరిచయం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆర్బీఐ నుండి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మామూలు కరెన్సీ నోట్లను చాలా జాగ్రత్తగా చూసుకుంటాం. తడిసినా, మడతపెట్టినా ఎక్కడ చిరిగి పోతాయోనని భయపడతాం. పైగా అచ్చం అసలు నోట్లను పోలినట్టుగా నకిలీ నోట్ల బెడద ఉండనే ఉన్నది. ఈ ఇబ్బందులు అన్నింటికీ చెక్ పెట్టేలా ప్లాస్టిక్ పాలిమర్ కరెన్సీ నోట్లను మన దేశంలో ప్రవేశ పెట్టేందుకు రిజర్వు బ్యాంకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుత కాగితపు కరెన్సీ కంటే ఎక్కువ కాలం మన్నిక ఉండే, ప్రత్యేక భద్రతా ఫీచర్లతో కూడిన ప్లాస్టిక్ కరెన్సీతో ఎక్కువ ప్రయోజనం ఉంటుందని భావిస్తోంది. మన దేశంలో కరోనా మహమ్మారి తర్వాత డిజిటల్ చెల్లింపులు భారీ స్థాయిలో పెరిగాయి. అయితే అందులో చాలా వరకు చిన్న చిన్న మొత్తాల్లో యూపీఐ ద్వారా జరిగే లావాదేవీలే. ఒక మోస్తరు లావాదేవీల్లో నగదు చలామణీయే ఎక్కువ. డిజిటల్ చెల్లింపులపై నిఘా ఉంటుందని, ఆదాయ పన్ను, ఇతర పన్నులు చెల్లించాల్సి వస్తుందనే ఉద్దేశంతో చాలా మంది వ్యాపారులు ఒకస్థాయికి మించి ఆన్‌లైన్ చెల్లింపులను స్వీకరించడం లేదు. నగదు ఇవ్వాలనే కోరుతున్నారు. నగదుగా ఇస్తే ధర కాస్త తగ్గించి ఇస్తున్న వారూ ఉన్నారు. మరోవైపు ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ వినియోగం తక్కువ. అవగాహన లేకపోవడం, మోసాల భయం, ఆన్‌లైన్ చెల్లింపులకు అవసరమైన స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ వ్యయం వంటివి సమస్యగా మారాయి. ఈ కారణాలతో ఇటీవల కాలంలో నగదు వినియోగం మళ్లీ పెరిగిపోతోంది. రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి దేశంలో రూ.42.86 లక్షల కోట్ల విలువైన కరెన్సీ నోట్లు చలామణీలో ఉన్నాయి. అంతకు ముందటి ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 11.5 శాతం ఎక్కువ. ఈ నేపథ్యంలోనే ప్లాస్టిక్ కరెన్సీనీ ప్రవేశ పెట్టేందుకు రిజర్వు బ్యాంకు కసరత్తు చేస్తోంది. రిజర్వు బ్యాంకు దేశంలో ఏటా పాతబడిన, చిరిగి న కరెన్సీ నోట్లను ధ్వంసం చేస్తుంది. వాటి స్థానంలో కొత్త నోట్లను ముద్రించి విడుదల చేస్తుంది. ఇలా 2023-24లో నోట్ల ముద్రణకు రూ.5,101 కోట్ల ఖర్చుకాగా, 2024-25లో వ్యయం రూ.6,372 కోట్లకు పెరిగింది. పెరుగుతున్న ముడి పదార్థాల ధరలతో ఈ వ్యయం మరింతగా పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇటీవల పాట్నా, ముంబైలలో నిర్వహించిన రెండు బోర్డు సమావేశాల్లో ఆర్బీఐ అధికారులు ప్లాస్టిక్ కరెన్సీని ప్రవేశపెట్టే అంశంపై చర్చించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. తొలుత ప్రయోగాత్మకంగా రూ.10, రూ.20 ప్లాస్టిక్ కరెన్సీ నోట్ల ను విడుదల చేయాలని భావిస్తున్నట్టు తెలిపాయి. ప్రజల స్పందన, సౌలభ్యం, ముద్రణ ఖర్చు ఆధారంగా అవసరమైన మార్పులతో రూ.200, 500 నోట్లు కూడా విడుదల చేసే అవకాశం ఉందని తెలిపాయి.

బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం

## విజయవంతం చేయాలి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రాహ్మణుల ఐక్యత ధ్యేయంగా జూలై 19న రాజమండ్రిలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం జరుగుతుందని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యక్రమ ఆహ్వాన కమిటీ సభ్యులు భమిడిపల్లి వెంకట రమణ మూర్తి(బాబు), కాకినాడ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ వై.పద్మనాభ స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వార్పు రోడ్లో బ్రాహ్మణ సత్రం వద్ద ఆత్మీయ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బ్రాహ్మణులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. బ్రాహ్మణులలో ఐక్యత కొరకు అందరూ ఏకత్రాటిపై రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని రంగాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు హాజరవ్వడం వలన అర్థవంతమైన చర్చలు జరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణుల సామాజిక ఆర్థిక,రాజకీయ, సంఖ్యా పరంగా గుర్తించి అసమానతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియపరచేందుకు ప్రాతినిధ్యం చేయడం జరుగుతుందని అన్నారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి, బ్రాహ్మణ వివాహాలపై యువతీయువకులకు అవగాహన కల్పించడం, బ్రాహ్మణులు, అర్చకులు, పురోహిత రక్షణకై ప్రత్యేక చట్టాలు, వివిధ అంశాలపై పెద్దలతో చర్చా గోష్టులు వుంటాయని తెలిపారు. జూలై 19న రాజమండ్రి ఏకేసి కాలేజి దగ్గర మన్యం గార్డెన్స్ లో జరిగే కార్యక్రమ నిర్వహణలో బ్రాహ్మణ సామాజిక వర్గ అన్ని సంఘాలు, అర్చకులు, పురోహితులు, వ్యాపారవేత్తలు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన పెద్దలు ప్రతిఒక్కరూ కలిసివచ్చి తమ తోడ్పాటు అందించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కందాళ రవి, దివి శ్రీనివాస్, బాదంపూడి బ్రదర్స్, నిముషకవి వెంకటేష్, వి.సూర్యప్రకాశరావు, తురగా సాయి సుబ్బారావు, ఆకెళ్ళ శ్రీనివాస్, రాయవరపు ప్రభాకర్, అర్చక పురోహిత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పన్నులు కట్టాల్సిందే.. పవన్ ఆగ్రహం

ఏపీలోని పంచాయతీరాజ్ పరిధిలో ఉన్న అన్ని సంస్థలు పన్నులు చెల్లించాల్సిందేనని ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తేల్చి చెప్పారు. 5400 కోట్ల రూపాయల మేరకు పన్నులు బకాయి పెట్టడాన్ని ఆయన తీవ్రంగా భావించారు. ఇలా చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయన్న అధికారుల సమాచారంపై మరింత మండి పడ్డారు. ఏ పార్టీ అయినా.. పన్నులు కట్టడాన్ని నిరాకరించిందా? అలా అయితే.. ప్రభుత్వానికి సొమ్ములు ఎక్కడ నుంచి వస్తాయి? ఈ విధానం సరికాదు.. అని పవన్ వ్యాఖ్యానించారు. పంచాయతీల పరిధిలో వనరులను వినియోగించుకుంటున్న కార్పొరేట్ విద్యాసంస్థలు, పరిశ్రమలు పన్నులు బకాయి పెట్టా రన్న విషయంపై తెలిసిన ఆయన..ఆయా సంస్థలకు తక్షణమే నోటీసులు ఇచ్చే విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాల న్నారు. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించరాదని తేల్చి చెప్పారు. --వారేమైనా ప్రజలకు ఉచిత సేవలు అందిస్తున్నారా? అవేమైనా స్వచ్ఛంద సంస్థలా.. భారీ ఎత్తున లాభాలను ఆర్జిస్తూ.. ప్రభుత్వానికి పన్నులు కట్టకపోవడం



అంటే సరైన విధానం కాదు. ఈ విషయాన్ని చూస్తూ.. ఊరుకునేది లేదు అని చెప్పారు. ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకువెళ్తానని చెప్పారు. ముఖ్యంగా ఇటీవల గోదావరి కాలుష్యానికి కారణమైన.. ఆంధ్ర పేపర్ మిల్లు ఏకంగా 13 కోట్ల రూపాయల మేరకు పన్నులు చెల్లించకపోవడాన్ని తీవ్రంగా భావించిన పవన్ కల్యాణ్.. అసలు ఎందుకు కట్టడం లేదని ప్రశ్నించారు. సామాన్యులు, చిరుద్యోగులు, రోడ్డుపక్కన వ్యాపారాలు చేసుకునే వారు కూడా ప్రభుత్వానికి పన్నులు కడుతున్నారన్న విషయాన్ని ప్రస్తావించిన ఆయన.. వారికంటే.. వీరేమైనా అతీతులా? అని ప్రశ్నించారు. ఎవరినీ ఉపేక్షించేది లేదని..అందరి నుంచి నిర్దేశిత సమయంలో పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. 5400 కోట్ల రూపాయలు అంటే మాటలు కాదని.. ప్రభుత్వానికి ఉన్న ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఈ సొమ్ము అత్యంత ఆవస్యకమని పేర్కొన్నారు. పన్నులను వసూలు చేసే విషయంలో మరింత పాదర్శకత తీసుకువస్తామన్నారు.

పంచాయతీల్లో వనరులను వినియోగించుకుంటున్న వారు.. పన్నులు చెల్లించకుండా ఎగ్గొట్టే ధోరణితోనో.. రాజకీయ జోక్యంతోనో వ్యవహరిస్తే.. ఊరుకోవద్దని తేల్చి చెప్పారు. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్ను వసూళ్లు చేయాలని ఆదేశించారు.

## ఆచూకీకై సంప్రదించండి




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గుత్తుల అప్పయ్యమ్మ వయసు 70 భర్త పేరు మునలయ్య ఈమె ప్రస్తుతం స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతుంది. స్థానిక ప్రకాష్ నగర్ పోలీసులు ఆమెను స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో చేర్చారు. వివరాల్లోకి వెళితే నారాయణపురం ప్రాంతానికి చెందిన అప్పయ్యమ్మ రెండు రోజులుగా బయట తిరుగుతుండగా తొలిత ప్రభుత్వ ఆసుపత్రిలోని వన్ స్టాప్ సెంటర్‌కి చేర్చారు. అక్కడ నుండి ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్‌కి అప్పగించగా ప్రకాష్ నగర్ పోలీసులు ఆమెకు సంబంధించిన సమాచారాన్ని సేకరించే ప్రయత్నంలో ఆశ్రయం కల్పించాల్సిందిగా స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబుని సంప్రదించారు. అందుకు రాంబాబు అంగీకరించి అప్పయ్యమ్మకు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించి కావలసిన ఏర్పాట్లు చేశారు. వృద్ధురాలని ఆశ్రమంలో చేర్చడానికి శ్రద్ధ తీసుకున్న ప్రకాష్ నగర్ స్టేషన్ అధికారి బాజీలాల్ ,స్టేషన్ రైటర్ ఎం. బాబురావు, కానిస్టేబుల్ శివప్రసాదులను రాంబాబు అభినందించారు. వృద్ధురాలని. ఆమె ఎవరూ లేక రోడ్డున పడ్డాదో లేదా కుటుంబ సభ్యుల నిర్లక్ష్యమో, వృద్ధాప్య సమస్యల వల్ల ఆమె బయటకు వచ్చిందో తెలియడం లేదని ఆమెకు సంబంధించిన వారు ఎవరు వచ్చినా ఆమెను తిరిగి అప్పగిస్తామని స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు తెలిపారు.

## సత్తెనపల్లి సీటుపై హాట్ డిబేట్.. ఏం జరుగుతోంది.. ?




పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో టీడీపీ తరఫున కన్నా లక్ష్మీనారాయణ విజయం దక్కించుకున్నారు. ఇప్పుడు ఇదే నియోజకవర్గంపై టీడీపీలో హాట్ డిబేట్ కొనసాగుతోంది. ఇటీవల నిర్వహించిన మహానాడుకు కన్నా పెద్దగా మనసు పెట్టలేదని అంటున్నారు. దీనికి తోడు ఆయన అసంతృప్తితోనే ఉన్నారు. మంత్రి వర్గంలో చోటు కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఇక, ఆ తర్వాత.. ఆయన కీలక సమయాల్లోనూ.. పార్టీకి. ప్రభుత్వానికి కూడా అంటీముట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు వయసు నేపథ్యంలో గతంలో ఉన్నంత చురుకుగా కన్నా రాజకీయాలు చేయలేకపోతున్నారు. సీనియర్ నాయకుడు, సుదీర్ఘంగా 30 ఏళ్లకుపైనే రాజకీయాల్లో ఉన్న నేపథ్యంలో ఆయన ఇప్పుడు యాక్టివిటీ పెంచే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు సత్తెనపల్లి నియోజకవర్గం టికెట్‌ను వచ్చే ఎన్నికల్లో కోడెల కుటుంబానికి ఇచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఇటీవల జరిగిన మహానాడుకు.. కోడెల కుమారుడు శివరామకృష్ణ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. దీనివెనుక.. ఆయన వచ్చే ఎన్నికలకు సంబంధించి రంగం రెడీ చేసుకుంటున్నారన్న చర్చ ప్రారంభమైంది. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గాలపునర్విభజన జరిగితే.. ఖచ్చితంగా కోడెలకు టికెట్ వస్తుం దని మొన్నటి వరకు చర్చ జరిగినా.. ఇప్పుడు సత్తెనపల్లి నుంచి ఆయన పోటీ చేయడం ఖాయమని అంటున్నారు. పైగా.. కోడెల తాలూకు సెంటిమెంటు కనిపిస్తుండడం.. పార్టీలోనూ మార్పు దిశగా అడుగులు వేయాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో కోడెల వారసుడికి ఆశలు పెరుగుతున్నాయి. మహానాడు అనంతరం.. శివరామకృష్ణ.. గుంటూరులో మంత్రి నారా లోకేష్‌ను కలుసుకున్నారని తెలిసింది. దీనికి కూడా అదే నేపథ్యం ఉందన్న చర్చ ఉంది. వచ్చే సారైనా తనకు అవకాశం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేయడంతో అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని నారా లోకేష్ చెప్పారని సమాచారం. ఇలా.. సత్తెనపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న మార్పులు.. చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తే.. మార్పు దిశగా పార్టీ అడుగులు వేస్తున్న విషయం స్పష్టమవుతోంది. అయితే.. ఎన్నికలకు మూడేళ్ల సమయం ఉన్న నేపథ్యంలో అధికారికంగా ఎప్పుడు ప్రకటిస్తారన్నది చూడాలి.

## రఘురామ వర్సెస్ జడ శ్రావణ్ : డీజీపీకి లేఖ



ఏపీ శాసన సభ ఉప సభాపతి రఘురామ క్రిష్ణం రాజు డీజీపీకి తాజాగా ఒక లేఖ రాశారు. ఆ లేఖలో ఆయన మాజీ మేజిస్ట్రేట్ మరియు జై భీమ్ రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్‌పై ఆరోపణలు చేసారు. ఏపీలో మత విద్వేషాలను ప్రేరేపించేలా వ్యవహరించిన జడ శ్రావణ్ కుమార్ వ్యవహరిస్తున్నారు అని రఘురామ పేర్కొన్నారు. జడ శ్రావణ్ కుమార్ చేసిన ఆరోపణలు అలాగే ఆయన వ్యాఖ్యల మీద వాస్తవాలు పూర్తిగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**నాపై దురుద్దేశ ఫిర్యాదులు :** ఇదిలా ఉంటె తన మీద జడ శ్రావణ్ కుమార్ దురుద్దేశ పూర్వకంగా సామూహిక ఫిర్యాదులు చేయిస్తున్నారు అని రఘురామ డీజీపీకి రాసిన లేఖలో ఆరోపించడం విశేషం. అందువల్ల ఆయన చేసిన ఫిర్యాదులను పక్కన పెట్టాలని కూడా రఘురామ కోరారు. దళిత క్రిస్టియన్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అంటూ బహిరంగంగానే మెసేజీలను జడ శ్రావణ్ కుమార్ చాలా మందికి పంపిస్తున్నారు, నేను రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉండి సమాజంలో కులాలు మతాల మధ్య విభజన తీసుకుని వస్తున్నాను అని కూడా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు అని డీజీపీకి రాసిన లేఖలో రఘురామ క్రిష్ణం రాజు పేర్కొన్నారు.

**అందరూ పాటించాల్సిందే :** ఈ తరహా ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లుగా రఘురామ చెప్పారు. తాను రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్నాను అని తాను చెప్పేది ఒక్కటే అని రాజ్యాంగం ప్రకారం అంతా నడచుకోవాలని అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఎస్సీ ఎస్టీ చట్టం ప్రకారం దళితులు ఎవరైనా క్రిస్టియన్ మతంలో చేరితే వారు తమ రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కోల్పోతారని మాత్రమే చెప్పాను అని రఘురామ అన్నారు.

**రాజ్యాంగ బద్ధంగానే :** దీని మీద 2025 మార్చి 24న చింతాడ ఆనంద్ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. మరో వైపు దళిత క్రిస్టియన్లకు రిజర్వేషన్లు ఉండాలని ఆ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలని కోరుతున్నారని ఆయన చెప్పారు. అదే కనుక జరిగితే ఈ తరహా డిమాండ్లు మరిన్ని పుట్టుకుని వస్తాయని రఘురామ ఆందోళన వ్యక్తం చేశారు.

**విచారించాలని కోరుతూ :** ఈ నేపథ్యంలో రఘురామ డీజీపీకి లేఖ రాసి అందులో అనేక అంశాలను పొందుపరిచారు. మత పరమైన విద్వేషాలను ప్రేరేపించే శక్తుల విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అంతే కాకుండా తనకు వ్యతిరేకంగా జడ శ్రావణ్ కుమార్ దళిత క్రిష్టియన్లకు బహిరంగ సదేశాలను పంపిస్తూ సామూహిక ఫిర్యాదులకు ప్రేరేపిస్తున్న విషయం మీద చర్యలు తీసుకోవాలని రఘురామ కోరారు. మొత్తానికి రఘురామ మరో అడుగు ముందుకేసి ఈ విషయంలో గట్టిగా తేల్చుకోవాలని చూస్తున్నారు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో జరిగిన అక్రమాలపై

## సమగ్ర విచారణ జరపాలి

**పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలలో జరిగిన అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని పిడిఎస్ యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. అర్హులైన క్రీడాకారులకు అన్యాయం జరిగిందనే ఆరోపణలు వెలుగులోకి వస్తున్న నేపథ్యంలో పారదర్శకంగా దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పోర్ట్స్ కోటా పేరుతో నిబంధనలకు విరుద్ధంగా ఎంపికలు జరిగి ఉంటే వాటిని రద్దు చేసి, నిజమైన అర్హత కలిగిన అభ్యర్థులకు న్యాయం చేయాలని అన్నారు. యువత భవిష్యత్తుతో ముడిపడిన నియామకాల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలను ప్రజల ముందుంచి పారదర్శకతను నిరూపించాలని, అర్హుల హక్కులను కాపాడాలని పిడిఎస్ యు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని ఎస్.కిరణ్ కుమార్ తెలిపారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com



# సంపూర్ణ అవగాహనతో "సర్" కోసం సన్నద్ధం కండి

## - డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పిలుపు






**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** జూన్ 15వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సర్ ఎన్యూమనేషన్ కార్యక్రమానికి సంపూర్ణ అవగాహనతో వైఎస్ఆర్సిపి బిఎల్ఏ లంతా సన్నద్ధం కావాలని వైఎస్ఆర్సిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. నిడదవోలు నియోజకవర్గం డిఎల్ఏ ల సమావేశం నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు జి.శ్రీనివాస నాయుడు అధ్యక్షతన మంగళవారం నిడదవోలులోని రోటరీ హాలులో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి నిడదవోలు నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు హాజరయ్యారు. "సర్" కార్యక్రమం పై టాస్క్ ఫోర్స్ ప్రతినిధులు కృష్ణప్రియ, పరమేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సర్ కార్యక్రమంపై అవగాహన లేకపోతే నష్టపోతామని అందుచేత సంపూర్ణమైన అవగాహనతో ఇన్యూరేషన్ ప్రక్రియకు సిద్ధం కావాలని చెప్పారు. తండ్రికి కొడుక్కి మధ్య వయసు వచ్చాక తక్కువగా ఉన్న ఓటు కోల్పోతామని, ఆడవాళ్ళకి మగవారికి ఒకే పేరు ఉన్నప్పటికీ మిస్ మ్యాచ్ అని ఓటు తొలగించే ప్రమాదం ఉందని.. ఇలాంటి విషయాల్లో కూడా సంపూర్ణ అవకాశాలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించి బిఎల్ఏలు చాలా కీలకమైనటువంటి పాత్ర నిర్వహించాల్సి ఉందని డాక్టర్ గూడూరి శ్రీనివాస్ చెప్పారు.

### ఇసుక లారీల వలన బిజెపి నాయకుడు రమణకు జరిగిన

# ప్రమాదంపై న్యాయం చేయాలి

## జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం రాత్రి రెండు గంటల ప్రాంతంలో రాజమహేంద్రవరం నుండి సీతానగరం కార్లో వస్తున్న ఎస్సీ మోర్చా ఆంధ్రప్రదేశ్ బిజెపి స్టేట్ సెక్రటరీ మాట్టాడి వెంకట రమణను కాటవరం పెట్రోల్ బంకు సమీపంలో అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ఇసుక లారీలు మితిమీరిన వేగంతో ప్రయాణించడంతో బిజెపి నాయకుడు కారు డ్యామేజి అయిందని కారులో ఉన్న రమణకు కాలుకు బలమైన ప్రమాదం జరిగిందని న్యాయం కోసం ఆశ్రయించిన పోలీసులు, ఇసుక ర్యాంపుల యాజమాన్యాలు నిర్లక్ష్యం వహించడం సరికాదని జిల్లా బిజెపి నాయకుడు పిక్కి నాగేంద్ర విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా నాయకుడు నాగేంద్ర తెలియజేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ను అభివృద్ధి పథంలో నడిపించాలనే ఉద్దేశంతో పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇసుక పాలసీని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. మే నెల 31 సాయంత్రానికల్లా జిల్లా కలెక్టర్,మైనింగ్ అధికారుల ఆదేశాల మేరకు స్టాక్ పాయింట్లకు ఇసుక రవాణాను నిలుపుదల చేయాల్సి ఉండగా ఇసుక ర్యాంపుల యాజమాన్యాల వారు అధికారుల ఆదేశాలను సైతం పక్కనపెట్టి అర్ధరాత్రి రెండు గంటలు దాటినా పెద్దపెద్ద లారీల ద్వారా ఇసుక రవాణా చేస్తూ రహదారి మార్గం గుండా వెళ్ళే వారిని ప్రమాదాలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. కాటవరం ఇసుక రాంపల్లో నేటికీ పెద్ద పెద్ద కొండలను తలపించే విధంగా ఇసుక మేటలు వేసి ఉంచారని అన్నారు. ఆ ఇసుకను నదీ గర్భం నుండి స్టాక్ పాయింట్లకు రాకుండా చూడాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులకు ఎంతైనా ఉందని అన్నారు. అధికారులు ఇచ్చిన అనుమతులు గడువు దాటి ఇసుక రవాణా చేస్తున్నా మైనింగ్ అధికారులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు బాగానే ముడుపులు అందు తున్నాయని అందుకనే వారు స్పందించడం లేదని ప్రజలు అంటున్నారని ఆయన అన్నారు. రాజమహేంద్రవరం నుండి వస్తున్న రమణను ఇసుక లారీ ప్రమా ప్రమాదానికి గురిచేసినా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం చాలా బాధాకరమని అన్నారు. అందుకే రోడ్డుపై 20 నిమిషాల పాటు నిరసన దీక్ష చేశామని స్థానిక ఎస్ఐ న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసన విరమించామని అన్నారు. సింగవరం, రఘుదేవపురం, కాటవరం, మునుకూడలి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల వలన రహదారిపై ఇసుక లారీల ద్వారా జారిపడిన ఇసుక రోడ్డుపై అధికంగా పట్టడంతో ఇప్పటికే ద్విచక్ర వాహన దారులు జారిపడి ఎన్నో ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయని అన్నారు. ఇంత జరుగు తున్నా మైనింగ్,ఆర్ అండ్ బి,పోలీసు అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం చాలా బాధాకరమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇసుక వ్యాపారులు కొండలను తలపించే విధంగా రహదారి పక్కనే ఇసుక మేటలు వేయడంతో గాలికి ఇసుక ఎగిరి వాహనదారుల కళ్ళల్లో పడడంతో ప్రమాదాలు ప్రతిరోజ చోటు చేసుకుంటున్నాయని అన్నారు. రోడ్డుపై పడిన ఇసుకను ఎప్పటికప్పుడు తొలగించకపోతే అర్ధనగ్న నిరసనలు చేయడానికి వెనుకాడ బోనని అన్నారు. సీతానగరం మండలం నుండి పరిమితికి మించి అధిక లోడుతో, మితిమీరిన వేగంతో లారీల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదని మండిపడ్డారు. ఇసుక వ్యాపారుల వలన కాటవరం ఎత్తిపోతల పథకానికి నీరు సరిగా అందడం లేదని ఎత్తిపోతల పథకానికి వచ్చే నీరుకి అడ్డుగా ఇసుక వ్యాపారుల రవాణా కోసం పెద్ద రోడ్డును నిర్మించారని దాంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదని రైతులు ఆవేదన చెందుతు న్నారని అన్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు ఇసుక వ్యాపారులు ఇచ్చిన ముడుపులకు కక్కుర్తి పడి వేలాది ఎకరాల నీటి ఎద్దడికి కారణం అవుతున్నారని అన్నారు. ఇప్పటికే ఎలాంటి బిల్లులు లేకుండా లారీల ద్వారా ఇసుకను తరలిం చారని,ఇప్పుడు కోట్లాధి రూపాయల ఇసుకను కొండలను తలపించేలా ఇసుకను రహదారి చెంతనే డంపింగ్ చేశారని, ఇప్పుడు మళ్లీ ఇసుకను ఎలాంటి బిల్లులు లేకుండా తరలించేందుకు ఇసుక వ్యాపారులు సిద్ధంగా ఉన్నారని అన్నారు. డంపింగ్ చేసిన ఇసుకను తరలించే నేపథ్యంలో మైనింగ్ అధికారులు,జిల్లా కలెక్టర్ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని లేకుంటే ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండిపడుతుం దని అన్నారు. రోడ్డుపై ఇసుక పడుతుందని అడిగిన స్థానిక ప్రజలపై ఇసుక వ్యాపారస్తులు దౌర్జన్యాలకు దిగుతున్నారని మండల ప్రజలు అంటు న్నారని అన్నారు. గతంలో కాతేరు నుండి సీతానగరం రోడ్డు చాలా అస్తవ్యస్తంగా ఉండేదని ప్రభుత్వాలు స్పందించి రోడ్డును చక్కగా నిర్మాణం చేస్తే నేడు ఇసుక వ్యాపారస్తులు రోడ్డును ధ్వంసం చేస్తున్నారని నాగేంద్ర మండిపడ్డారు. వెంకటరమణ ఫిర్యాదుపై అధికారులు స్పందించి తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మాజీ మండల అధ్యక్షుడు గూడపాటి జయరాం, పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవిష్యత్ నిర్మాణానికి విద్యార్థులే పునాదిరాళ్లు

## ముగిసిన ఐదు రోజుల జ్ఞాన ప్రకాష్ డీఆర్పీల శిక్షణ




**దివాన్చెరువు, విశ్వం వాయిస్ న్యూస్ :** భావి భారత భవిష్యత్ నిర్మాణానికి పునాదిరాళ్లుగా ఉన్న విద్యార్థి అభ్యసనానికి బలమైన పునాది అవసరమని సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి పేర్కొన్నారు. రాజానగరం మండలం దివాన్చెరువు శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ నందు గత నెల 29 నుంచి నిర్వహించిన జ్ఞాన ప్రకాష్ ఐదు రోజుల డీఆర్పీల శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సమావేశానికి తూర్పుగోదావరి జిల్లా సమగ్ర శిక్షా ఏఎంఓ వై.లక్ష్మణకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీసీ సుభాషిణి మాట్లాడుతూ సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్ఫర్మేషన్(సాల్ట్)లో భాగంగా ఎన్జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు ప్రారంభించిందన్నారు. నూతన విద్యా విధానం-2020లో భాగంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన విద్యా సంస్కరణలు క్షేత్ర స్థాయికి తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత కేఆర్పీలు, డీఆర్పీలపై ఉందన్నారు. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగానే ప్రీ ప్రైమరీ, ప్రైమరీ తరగతుల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యా బోధన అమలు చేస్తున్నామన్నారు. ఎస్సీఈఆర్టీ రాష్ట్ర పరిశీలకురాలు కోటిపల్లి సరిత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లా ఏఎంఓలు పి.రాంబాబు, వై.లక్ష్మణకుమార్లు మాట్లాడుతూ ఈ నెల 4వ తేది నుంచి జిల్లా స్థాయిలో ఒకటవ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ను విజయవంతం చేయాలని డీఆర్పీలకు పిలుపునిచ్చారు. సమావేశంలో డైట్ లెక్చరర్ సాయిరామకృష్ణారావు, దీక్ష జిల్లా కోఆర్డినేటర్లు మంగరాణి, బలరామకృష్ణ, చింతా బాబులు తదితరులు మాట్లాడారు. అనంతరం డీఆర్పీలకు పార్టిసిపేషన్ సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన కేఆర్పీలను దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికలతో డీఆర్పీలు సత్కరించారు. కార్యక్రమంలో తూర్పు, పశ్చిమగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పోలవరం జిల్లాలకు చెందిన 276 మంది డీఆర్పీలు, 24 మంది కేఆర్పీలు పాల్గొన్నారు.

### సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో

# మలేరియా వ్యతిరేక మాసోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.శైలజ రాణి, డాక్టర్ వి.భవాని ఆధ్వర్యంలో పీహెచ్సీ సిబ్బందితో మలేరియా వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మలేరియా వ్యాధి గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ భవాని మాట్లాడుతూ మలేరియా వ్యాధి ఎనాపిల్లిస్ అనే ఆడదోమ కుట్టడం ద్వారా వస్తుందని,ఈ వ్యాధిని అశ్రద్ధ చేస్తే అది క్రమంగా మెదడుకు సోకి ప్రాణాపాయం సంభవించవచ్చని, కాబట్టి దోమలు వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని,పాత టైర్లు, కొబ్బరి డొక్కులు లేకుండా చూసుకోవాలని నీటి కుండీలు, పూల కుండీలలో నీళ్లు మూడు రోజులు మించి నిల్వ లేకుండా చూడాలని, ఇంటి పరిసరాల్లోనూ, జనవాసాలకు దగ్గరలోనూ నీటి గుంటలు లేకుండా చూసుకోవాలని,దోమతెరలు వాడాలని,ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అన్నారు.కొద్దిపాటి జ్వరం వచ్చిన అశ్రద్ధ చేయకుండా ఆశా కార్యకర్తను సంప్రదించి ఆమె సహాయంతో మీ ఊరిలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ ఉన్న ఎం ఎల్ హెచ్ పి ద్వారా కష్టపరీక్షలు మందులు తీసుకోవాలని తెలియజేశారు.డాక్టర్ శైలజారాణి మాట్లాడుతూ జూన్ నెల అంతా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి గ్రామములోనూ మలేరియా నిర్మూలన గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ వై .ఎస్.రాయుడు, పి హెచ్ ఎన్ కె.ఆదిలక్ష్మి, జి.దైవ కృప, సూపర్వైజర్ కె.సుధాకర్, ఎల్ టి. శిల్పా, ఏ ఎన్ ఎం లు,హెల్త్ అసిస్టెంట్లు,ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి ఊపి సిబ్బంది పాల్గొన్నారు.వైద్య ఆరోగ్య సిబ్బంది మలేరియా నిర్మూలన మన అందరి లక్ష్యం అని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.

# ఎమ్మెల్యే వేగుళ్ళను కలసిన రాజమహేంద్రవరం ఎలక్ట్రికల్ ఎస్.ఇ తిలక్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట నియోజకవర్గం నకు సంబంధించి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న ఎలక్ట్రిక్ డిపార్ట్ మెంట్ గత నెల 30 తేదీ నుండి తూర్పుగోదావరి జిల్లాకు మారింది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ఎపిఇపిడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీరు కాకిలేటి తిలక్ కుమార్ మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ కు పూల మొక్కను అందజేశారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. లోవోల్టేజ్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ఎస్.ఇ తిలక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాజమహేంద్రవరం ఇ.ఇ నటరాజ్, అర్బన్ ఇ.ఇ లు రవికుమార్, శ్రీనివాస్, మండపేట డి.ఇ శ్రీధర్, ఎ.ఇ లు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచింది



## స్టేట్ వాలంటరీ వింగ్ జాయింట్ సెక్రటరీ పెదపాటి

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల కేంద్రంలో స్టేట్ వాలంటరీ వింగ్ జాయింట్ సెక్రెటరీ పెదపాటి రమేష్ (డాక్టర్ బాబు) విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నేటికి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు కార్యక్రమం పేరుతో మండల కేంద్రం బస్టాండ్ సెంటర్ నందు 4/6/2026 న ఉదయం 9 గంటలకు నిరసన కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి సీతానగరం మండల వ్యాప్తంగా ఉన్న వైసిపినాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నానని డాక్టర్ బాబు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజానగరం నియో జకవర్గం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొంటున్నారని అన్నారు.

### కూటమి ప్రభుత్వ అండదండలతో

# లంక గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా

## ఆపకపోతే ఉద్యమానికి సిద్ధం : ఎమ్మెల్సీ తోట హెచ్చరిక



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వ అండదండలతో అక్రమ ఇసుక రవాణా చేస్తున్నారని రాష్ట్ర సబ్ ఆర్డినేట్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. లంక గ్రామాల్లోని ఇసుక అక్రమ రవాణా రాత్రి పగలు అనే తేడా లేకుండా తరలిస్తున్నారని ఆరోపించారు. వీటినితక్షణం నిలిపివేయాలనీ డిమాండ్ చేశారు. అక్రమ తవ్వకాలుఆపకపోతే తనతో సహా స్వచ్ఛందంగా వైయస్సార్ శ్రేణులు ముట్టడిస్తామని హెచ్చరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తమ ఇష్టానుసారం ఇసుక, మట్టి దోపిడి చేస్తున్నారని తెలిపారు.మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ శాఖలు ఉన్నాయా లేవా అనే అనుమానం కలుగుతుందని ఎద్దేవా చేశారు. తాతపూడి లంకల నుండి గోదావరికి అటు వైపు నది ప్రవాహానికి అడ్డుగా రోడ్ వేసి విచ్చలవిడిగా ఇసుక టిప్పర్లు రాకపోకలు చేస్తున్నాయని విమర్శించారు. బొండు ఇసుక కేదార్లంక గ్రామం నుండి బొడిపాలెం వంతెన నుండి అక్రమ రవాణా చేస్తున్నారని ఆరోపించారు. వీటికి ఎటువంటి అనుమతులు లేవని పేర్కొన్నారు. ఎక్కడో ఒక చోట లీజుకు తీసుకున్నట్లు చూపించి నది గర్భంలో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని విమర్శించారు. రోజుకు వందల లారీలు విచ్చలవిడిగా ఇసుక టిప్పర్లు రాకపోకలు చేస్తున్నాయనిఆరోపించారు. దీనిపై కలెక్టర్, పోలీస్, అన్ని శాఖ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి నట్లు వివరించారు. ఇంత దారుణంగా ఇసుక మట్టి దోపిడి చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సమాజానికి ఏం సంకేతం ఇస్తున్నారని నిలదీశారు.గోదావరికి అడ్డుగా రహదార్లు నిర్మిస్తున్నారని ఇది దారుణమన్నారు. బోడిపాలెం వంతెన కూలిపోయే స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా అక్రమ తవ్వకాలు చేస్తున్నారని దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. రాజమహేంద్రం మైనింగ్ ఏడికి తను ఫిర్యాదు చేస్తే అక్రమ తవ్వకాలు చేస్తున్న వారికి ముందుగా సమాచారం ఇచ్చి ఇక్కడికి వస్తున్నారని ఆరోపించారు. వ్యవస్థలు పని తీరు ను తప్పుబట్టారు. ఇక్కడ తవ్వకాలు తక్షణం నిలిపివేయకపోతే తన ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు అక్కడికి చేరుకొని ముట్టడిస్తామని హెచ్చరించారు. గతంలో వైసిపి హయంలో ఇక్కడ స్థానిక ఇటుక బట్టీల అవసరాల కోసం తవ్వేవారని పేర్కొన్నారు. ఇపుడు చాలా దారుణ పరిస్థితి ఉందన్నారు. అక్కడ అక్రమాలను గుర్తించి బాధ్యుల పై కేసులు నమోదు చేయాలని లేనిపక్షంలో పరిమాణాలు తీవ్రంగా ఉంటాయని తోట త్రిమూర్తులు హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు గారపాటి అశోక్ కుమార్, మెండు బాపిరాజు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్లా వీరబాబు, గూటం సత్యనారాయణ, పోతంశెట్టి సత్యనారాయణ రెడ్డి, తోరం శ్రీను తదితరులు పాల్గొన్నారు.





## అందాల ముద్దుగుమ్మ తాప్సీ

# ఇక తెలుగు సినిమాలు చేయదా..?

2010లో ఝుమ్మంది నాదం సినిమాతో సినిమా ఇండస్ట్రీకి పరిచయమైంది తాప్సీ పన్ను. మొదటి సినిమాతోనే అందం, అభినయం పరంగా మంచి మార్కులు తెచ్చుకుంది. ఆ తర్వాత మిస్టర్ పర్ ఫెక్ట్, గుండెల్లో గోదారి, సాహసం, ఆనందో బ్రహ్మ తదితర సూపర్ హిట్ సినిమాల్లో నటించింది. తెలుగు సినిమాల్లో బిజీగా ఉండగానే బాలీవుడ్ కు వెళ్లిన తాప్సీ కూడా అక్కడ కూడా సక్సెస్ అయ్యింది. తొలి సినిమాతోనే కుర్రాళ్ల మనసు దోచేసింది. ఆకట్టుకునే రూపం, క్యూట్ స్మైల్‌తో మెస్మరైజ్ చేసింది తాప్సీ పన్ను. ఆతర్వాత ఈ బ్యూటీకి తెలుగులో అవకాశాలు వెతుకుంటూ వచ్చాయి. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి బిజీ హీరోయిన్ గా మారిపోయింది. తెలుగులో చాలా సినిమాల్లో నటించింది ఈ చిన్నది.. కానీ అంతగా గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. అదే సమయంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమాతో హిట్ అందుకుంది. ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసింది. అక్కడ వరుసగా సినిమాలు చేస్తుంది. తక్కువ సమయంలోనే బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. కమర్షియల్ సినిమాలతో పాటు లేడీ ఓరియంటెడ్ సినిమాలు కూడా చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది ఈ భామ. ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ మూవీస్ చేస్తూ బ్యాక్ టు బ్యాక్ హిట్స్ కొట్టింది. పింక్, బేబీ, ది ఘాజీ అటాక్, నామ్ షబానా, జుద్వా, ముల్క్, బద్లా, మిషన్ మంగళ్, తప్పడ్, సాండ్ కీ ఆంఖ్, హసీనా దిల్ రుబా, డుంకీ తదితర సూపర్ హిట్ సినిమాల్లో నటించిందీ ముద్దుగుమ్మ. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ చేతిలో స్టార్ హీరోల సినిమాలతో పాటు లేడీ ఓరియంటెడ్ మూవీస్ కూడా ఉన్నాయి. బాలీవుడ్ లో అక్కడి ఫెయిర్ బ్రాండ్ కంగనా రనౌత్ తో మాటల యుద్ధం చేసింది ఈ చిన్నది. ఇక సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే ఈ భామ హాట్ హాట్ ఫోటోలు సెగలు పుట్టిస్తున్నాయి. ఈ ముద్దుగుమ్మ సినిమా షూటింగ్స్ గ్యాప్స్‌లో విదేశాల్లో విహరిస్తూ ఆ ఫోటోలను, వీడియోలను నెట్టింట అభిమానులను ఆకర్షిస్తుంది.

# టైటిల్ మార్చాలని సెన్సార్ బోర్డు చెప్పింది..

## కట్ చేస్తే ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది



మెగాస్టార్ చిరంజీవి.. ఈ పేరుకు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇండస్ట్రీలో బాస్ అంటే టక్కున చెప్పే పేరు మెగాస్టార్ చిరంజీవి. ఎన్నో సినిమాలు మరెన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించి ఆకట్టుకున్నారు చిరంజీవి. అనతికాలంలోనే టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి సినీ కెరీర్‌కు పునాది వేసిన సినిమా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య చిత్రం ఒక అరుదైన విజయగాథ. 1982 ఏప్రిల్ 23న విడుదలైన ఈ సినిమా, నారాయణగూడ శాంతి థియేటర్‌లో ఏకంగా 525 రోజులు ఆడి ఒక అపురూపమైన రికార్డును నెలకొల్పింది. చిల్లగట్టు శ్రీకాంత్ ఈ చిత్రానికి సంబంధించిన ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలను, అప్పటి పరిస్థితులను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి ఇంజనీర్ రాజశేఖర్ పాత్ర పోషించగా, గొల్లపూడి మారుతీరావు టైటిల్ రోల్ సుబ్బారావు గా నటించారు. వాస్తవానికి, గొల్లపూడి మారుతీరావు చిరంజీవి నటించిన పలు చిత్రాలకు మాటలు రాశారు. ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్యలో గొల్లపూడి నటించారని తెలిసినప్పుడు చిరంజీవి స్వయంగా ఆశ్చర్యపోయారట. కోడి రామకృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా షూటింగ్ సమయంలో, చిరంజీవి ఒక లాంచీలో కూర్చుని నారింజ తొనను విసురుతూ, అది నోట్లో పడితే సినిమా హిట్, లేకపోతే ఫట్ అని కోడి రామకృష్ణతో సరదాగా చెప్పిన సంఘటన గుర్తుచేసుకున్నారు. చిరంజీవి డాన్స్‌కు ఈ సినిమా ఒక నిదర్శనం.. వచ్చే వచ్చే వానజల్లు పాటలో చిరంజీవి డాన్స్ ఆయన స్వయంగా డాన్స్ కంపోజ్ చేసుకున్నారు. చిరంజీవికి వైట్ కలర్ ప్యాంట్ సెంటిమెంట్ కూడా అప్పటినుంచే మొదలైందని గుర్తు చేసుకున్నారు. సినిమా నిర్మాణం అనంతరం సెన్సార్ బోర్డుతో అనేక సమస్యలు తలెత్తాయి. సుబ్బారావు పాత్రకు సంగీత దర్శకుడు జె.వి.రాఘవులు జై జగదీశ హరే అనే భక్తి గీతాన్ని నేపథ్య సంగీతంగా ఉపయోగించడంపై సెన్సార్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దాసరి నారాయణరావు, డి.వి.ఎస్.రాజు వంటి సినీ ప్రముఖులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేశారు. సినిమా టైటిల్ మార్చి "ఇంట్లో సుబ్బయ్య, వీధిలో దిబ్బయ్య" వంటి పేర్లు పెట్టమని సెన్సార్ అధికారి సూచించారట. అనేక అడ్డంకులను అధిగమించి విడుదలైన ఈ చిత్రం, బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయం సాధించింది. మహిళల కోసం ప్రత్యేకంగా మ్యాట్నీ షోలు ప్రదర్శించడం ఈ సినిమా విశేషం. అదే ఏడాది జులై 9న విడుదలైన దాసరి నారాయణరావు బొబ్బిలి పులితో పోటీ పడి కూడా ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య మంచి విజయాన్ని అందుకుంది. వంద రోజుల వేడుకల్లో దాసరి నారాయణరావు చేతుల మీదుగా చిరంజీవి షీల్డ్ అందుకున్నారు చిరంజీవి. చిరంజీవి కేవలం రెమ్యునరేషన్‌తో సంబంధం లేకుండా పాత్రకు పూర్తి న్యాయం చేస్తారని ఈ సినిమా నిరూపించింది. ఈ చిత్రం తర్వాత శుభలేఖ, రాధ మై డార్లింగ్, బంధాలు అనుబంధాలు, మంచు పల్లకి వంటి కుటుంబ కథా చిత్రాలకు ఇది ఆలంబనగా నిలిచింది. గొల్లపూడి మారుతీరావు, కోడి రామకృష్ణ, కే.రాఘవ వంటి ప్రముఖులు ప్రస్తుతం లేకపోయినా, వారి కృషి వల్ల తెలుగు సినిమా చరిత్రలో ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య ఒక చెరిగిపోని అధ్యాయంగా నిలిచిపోయింది.

## సచిన్, కోహ్లీల రికార్డులు అవుట్..

# 15 ఏళ్లకే బ్లాంక్ చెక్కులు అందుకుంటున్న వైభవ్ సూర్యవంశీ

ఐపీఎల్ ముగింపు వేడుకల్లో మేజర్ అవార్డులన్నింటినీ ఇతడే క్లీన్ స్వీప్ చేశాడు. దాంతో రాత్రికి రాత్రే ఈ బిహార్ కుర్రాడి బ్రాండ్ వాల్యూ ఆకాశాన్ని తాకింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం పక్కకు నెట్టి కార్పొరేట్ కంపెనీలు ఈయన వెనుక పరుగులు పెడుతున్నాయి. క్రికెట్ ప్రపంచంలో ప్రస్తుతం ఒకే ఒక్కడి పేరు మారుమోగిపోతోంది. అతడే 15 ఏళ్ల టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2026 సీజన్‌లో ఈ బుడ్డోడు సృష్టించిన సునామీ అంతా ఇంతా కాదు. రాజస్థాన్ రాయల్స్ జట్టు తరపున ఆడిన వైభవ్.. తన బ్యాటింగ్ విశ్వరూపంతో క్రికెట్ దిగ్గజాలనే ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ ముగింపు వేడుకల్లో మేజర్ అవార్డులన్నింటినీ ఇతడే క్లీన్ స్వీప్ చేశాడు. దాంతో రాత్రికి రాత్రే ఈ బిహార్ కుర్రాడి బ్రాండ్ వాల్యూ ఆకాశాన్ని తాకింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం పక్కకు నెట్టి కార్పొరేట్ కంపెనీలు ఈయన వెనుక పరుగులు పెడుతున్నాయి. ఐపీఎల్ 2026 సీజన్‌లో రన్నరప్ రేసులో రాజస్థాన్ క్వాలిఫైయర్-2 లో ఓడిపోయినప్పటికీ, వైభవ్ సూర్యవంశీ మాత్రం చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సాధించడంతో పాటు మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది సీజన్, సూపర్ స్ట్రైకర్, సూపర్ సిక్సెస్ అవార్డులను కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చిన్న వయసులో ఈ అవార్డులు గెలవడమే కాకుండా.. ఒకే సీజన్‌లో ఎంవీపీ, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులు రెండూ సాధించిన ఏకైక ఆటగాడిగా రికార్డులకెక్కాడు. ఐపీఎల్ వ్యవస్థాపకుడు లలిత్ మోదీ సైతం స్పందిస్తూ.. భవిష్యత్తులో బాలీవుడ్, హాలీవుడ్ స్టార్ల కంటే పెద్ద సెలబ్రిటీ వైభవ్ అవుతాడని జోస్యం



చెప్పారు. ఐపీఎల్‌లో వైభవ్ చూపించిన ప్రతాపానికి బ్యాట్ స్పాన్సర్‌షిప్ మార్కెట్ అప్సెట్ అయిపోయింది. కోహ్లీ బ్యాట్ స్పాన్సర్ ఎమ్ఆర్ఎఫ్, రోహిత్ శర్మ బ్యాట్ స్పాన్సర్ సియట్ లాంటి దిగ్గజ క్రీడా సంస్థలు వైభవ్ బ్యాట్ రైట్స్ కోసం పోటీ పడుతున్నాయి. మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం ఒక ప్రముఖ కంపెనీ అయితే ఈ 15 ఏళ్ల కుర్రాడికి ఏకంగా బ్లాంక్ చెక్ ఇచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రేజ్ చూసి వైభవ్ తన కమర్షియల్ యాడ్స్ రేట్లను ఏకంగా రెట్టింపు చేసేశాడు.

**కాంప్లాన్ ఇండియా.. కోట్లతో తొలి అడుగు**

వైభవ్ సూర్యవంశీ కమర్షియల్ జర్నీ ప్రముఖ న్యూట్రిషన్ బ్రాండ్ కాంప్లాన్ ఇండియాతో ప్రారంభమైంది. 2026 ప్రారంభంలోనే కాంప్లాన్ సంస్థ అతనితో థోడా ప్లాన్, థోడా కాంప్లాన్ అనే క్యాంపెయిన్ కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ దాదాపు రూ.75 నుంచి 80 లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ యాడ్‌లో వైభవ్ క్రమశిక్షణతో కూడిన శిక్షణ, క్రీడాకారులకు పోషకాహారం ఎంత ముఖ్యమనే విషయాలను హైలైట్ చేశారు.

**రెడ్ బుల్ ఛాలెంజ్.. గూగుల్ పే పాకెట్ మనీ యాడ్**

ఐపీఎల్ 2026 టోర్నీ జరుగుతున్న సమయంలోనే వైభవ్ తన రాజస్థాన్ రాయల్స్ టీమ్‌మేట్ ధ్రువ్ జురెల్‌తో కలిసి రెడ్ బుల్ ఇన్నోవేటివ్ ఛాలెంజ్‌లో కనిపించాడు. స్పిన్నింగ్ వీల్ గేమ్ ద్వారా 30 బంతుల్లో 60 పరుగులు చేసే టాస్క్‌లో పాల్గొని అలరించాడు. దీనితో పాటు ప్రముఖ డిజిటల్ పేమెంట్ యాప్ గూగుల్ పే పాకెట్ మనీ క్యాంపెయిన్‌లో కూడా వైభవ్ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. టీనేజర్లు తమ యూపీఐ ఐడీలను తల్లిదండ్రుల బ్యాంక్ అకౌంట్లకు లింక్ చేసుకునే ఈ ఫీచర్ యాడ్‌లో 15 ఏళ్ల వైభవ్ రోజువారీ డిజిటల్ పేమెంట్స్ చేస్తూ కనిపించాడు.

**జార్ఖండ్ ఆరోగ్య శాఖ అంబాసిడర్‌గా.. ఎస్ఎస్ బ్యాట్ డీల్**

మే 30వ తేదీన జార్ఖండ్ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఇర్ఫాన్ అన్సారీ ఒక కీలక ప్రకటన చేశారు. వైభవ్‌ను యూత్ ఎనర్జీకి నిలువెత్తు రూపంగా అభివర్ణిస్తూ, త్వరలోనే జార్ఖండ్ ఆరోగ్య శాఖ తరుపున ప్రచారకర్తగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఇక క్రికెట్ కిట్ విషయానికి వస్తే.. ప్రముఖ స్పోర్ట్స్ తయారీ సంస్థ సరీన్ స్పోర్ట్స్‌తో వైభవ్‌కు ఎప్పటి నుంచో ఒప్పందం ఉంది. ఈ ఎస్ఎస్ బ్యాట్ స్పాన్సర్‌షిప్ ద్వారా వైభవ్‌కు ఏడాదికి దాదాపు రూ.50 లక్షల ఆదాయం లభిస్తోంది.

# ఐసీసీ సంచలన నిర్ణయం.. ఆ మూడు లీగ్‌లపై జీవితకాల నిషేధం..?




2008లో బీసీసీఐ ప్రారంభించిన ఐపీఎల్ తెచ్చిన భారీ సక్సెస్‌తో.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి దేశం తమ సొంత టీ20 లీగ్‌లను మొదలుపెట్టాయి. అయితే ఈ లీగ్‌ల వల్ల అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్ పూర్తిగా దెబ్బతింటోంది. ప్రస్తుతం క్రికెట్ ప్రపంచంలో ఫ్రాంచైజీ లీగ్‌ల హవా నడుస్తోంది. 2008లో బీసీసీఐ ప్రారంభించిన ఐపీఎల్ తెచ్చిన భారీ సక్సెస్‌తో.. ప్రపంచవ్యాప్తంగా దాదాపు ప్రతి దేశం తమ సొంత టీ20 లీగ్‌లను మొదలుపెట్టాయి. అయితే ఈ లీగ్‌ల వల్ల అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్ పూర్తిగా దెబ్బతింటోంది. ఆటగాళ్లు కూడా దేశం కంటే డబ్బులు ఎక్కువగా వచ్చే లీగ్‌లకే ప్రాధాన్యత ఇస్తూ ఫ్రీలాన్సర్లుగా మారిపోతున్నారు. ఈ పరిస్థితిని సీరియస్‌గా తీసుకున్న ఐసీసీ, లీగ్‌లు, అంతర్జాతీయ మ్యాచ్‌లు రెండూ కలిసి సాగేలా కొన్ని కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగానే అవినీతి, ఆర్థిక మోసాలు జరుగుతున్న మూడు ప్రముఖ టీ20 లీగ్‌లను ఐసీసీ పూర్తిగా నిషేధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**1. బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో ఆర్థిక అక్రమాలు**

ఐసీసీ రాడార్లో మొదటిగా కనిపిస్తున్న లీగ్ బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్. ఈ 2025/26 సీజన్‌లో ఈ లీగ్‌లో విపరీతమైన ఆర్థిక అవకతవకలు జరిగినట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు తమీమ్ ఇక్బాల్ స్వయంగా వెల్లడించారు. టోర్నమెంట్ జరుగుతున్న సమయంలో ఫ్రాంచైజీ యజమానులు తమకు జీతాలు ఇవ్వడం లేదంటూ అటు స్వదేశీ ప్లేయర్లు, ఇటు విదేశీ ప్లేయర్లు రోడ్డెక్కి బహిరంగంగా నిరసనలు చేశారు. వీటికి తోడు గత రెండేళ్లుగా బీపీఎల్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలు కూడా పెరిగిపోవడంతో ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ దీనిపై ప్రత్యేక నిఘా పెట్టింది. అంతర్జాతీయ మ్యాచ్‌ల సమయంలోనే ఈ లీగ్ జరగడం కూడా ఐసీసీ ఆగ్రహానికి మరో కారణం.

**2. గ్లోబల్ టీ20 కెనడాలో అవినీతి భూతం**

కెనడా క్రికెట్ బోర్డు ప్రస్తుతం ఐసీసీ నుంచి తీవ్రమైన విచారణను ఎదుర్కొంటోంది. 2026 టీ20 ప్రపంచకప్‌లో జరిగిన ఒక మ్యాచ్ ఫిక్సింగ్ స్కాండల్ తర్వాత ఈ బోర్డు గుట్టు రట్టయింది. కేవలం ఫిక్సింగే కాకుండా, బోర్డు సీఈఓకి సంబంధించిన దొంగతనాలు, భారీ ఆర్థిక మోసాల ఆరోపణల నేపథ్యంలో ఐసీసీ ఇప్పటికే కెనడా క్రికెట్ బోర్డును సస్పెండ్ చేసింది. అక్కడ జరుగుతున్న గ్లోబల్ టీ20 కెనడా లీగ్‌లో కూడా గతంలో ప్లేయర్లకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు మ్యాచ్‌లు ఆడటానికి నిరాకరించిన ఘటనలు ఉన్నాయి. కెనడా క్రికెట్ మెంబర్‌షిప్ వివాదం తేలేవరకు ఈ టోర్నమెంట్‌ను రద్దు చేయాలని ఐసీసీ భావిస్తోంది.

**3. లంక ప్రీమియర్ లీగ్‌కు ఫ్రాంచైజీల టెన్షన్**

శ్రీలంకలో జరిగే లంక ప్రీమియర్ లీగ్ కూడా ఐసీసీ బ్యాన్ లిస్టులో ఉండేలా కనిపిస్తోంది. 2025లో జరగాల్సిన ఈ లీగ్.. 2026 టీ20 వరల్డ్ కప్ వేదికల పునరుద్ధరణ కోసం పలుమార్లు వాయిదా పడి, చివరకు ఈ ఏడాది జూలై, ఆగస్టులలో నిర్వహించేందుకు ప్లాన్ చేశారు. అయితే ఎల్‌పీఎల్ ప్రారంభం నుంచి ఆర్థిక సమస్యలతో సతమతమవుతోంది. ఒప్పందం ప్రకారం ఆటగాళ్లకు డబ్బులు చెల్లించనందుకు గానూ ఇటీవలే జాఫ్నా కింగ్స్, కొలంబో స్ట్రైకర్స్ జట్ల ఓనర్లను బోర్డు తొలగించింది. ఈ లీగ్ బ్రాండ్ వాల్యూ చాలా తక్కువగా ఉండటం, అలాగే ఇంగ్లాండ్‌కు చెందిన ది హండ్రెడ్ లీగ్‌తో ఇది తలపడటం వల్ల దీనికి టీవీ రెవెన్యూ కూడా రావడం లేదు. ఐపీఎల్ ముగిసిన నెల రోజులకే ఇది జరగడం వల్ల ప్లేయర్ల లభ్యత కోసం లంక బోర్డు దీనిపై కఠిన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com